# ప్రజా తపన
prajathapana.com
News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 58 శుక్రవారం 14 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## అత్యంత ఎత్తయిన యుద్ధ క్షేత్రం సియాచిన్ గ్లేసియర్

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 13న భారత సైన్యం సియాచిన్ దినోత్సవాలను నిర్వహిస్తుంది. ఆపరేషన్ మేఘ్‌దూత్ లో సైన్యం ప్రదర్శించిన ధైర్యసాహసాలను, మాతృభూమి కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన, అత్యంత శీతల ప్రదేశంలో ఈ ఆపరేషన్ జరిగింది. భారత సైన్యానికి చెందిన హై ఆల్టిట్యూడ్ వార్‌ఫేర్ స్కూల్‌కు చెందిన కల్నల్ నరేంద్ర కుమార్ ప్రముఖ పర్వతారోహకుడు, కమాండెంట్. ఆయన 1977లో ఓ జర్మన్ రాఫ్టర్ దగ్గర ఓ మ్యాపును చూశారు. కారకోరమ్ పాస్‌ను ఎన్‌జే 9842కు కలుపుతూ ఓ చుక్కల గీత ఈ మ్యాపులో కనిపించింది. భారత్-పాకిస్థాన్ సరిహద్దు రేఖ ఎన్‌జే 9842 వద్ద ఉన్నట్లు ఇది చెప్తోంది. 1949లో ఐక్యరాజ్య సమితి మధ్యవర్తిత్వంతో అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఈ పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన 1977 నుంచి రెండు ఎక్స్‌పెడిషన్స్ నిర్వహించారు. ఈ భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని గ్రహించారు. అప్పటికే పాకిస్థాన్ ఈ భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు చర్యలు ప్రారంభించింది. సాధారణ పౌరులు ఈ ప్రాంతంలో పర్వతారోహణ చేసేందుకు అనుమతి ఇచ్చింది. అదే సమయంలో సైనికపరంగా నియంత్రణ సాధించేందుకు ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలో 1984 ఏప్రిల్ 13న ఆపరేషన్ మేఘ్‌దూత్‌ను భారత్ ప్రారంభించింది. దీనికి అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ అనుమతించారు. భారత సైన్యం అత్యంత సాహసోపేతంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో సాల్టారా రిడ్జ్, సియా లా, బిలాఫాండ్ లా వంటి ప్రధాన కనుమలపై ఆధిపత్యం సాధించింది. 2003లో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆపరేషన్ మేఘ్‌దూత్‌లో మోహరించిన దళాలను

(మిగతా 2లో)

## గేర్ మార్చిన నితీశ్ కుమార్

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**



బీహార్ ముఖ్యమంత్రి, జేడియూ అధినేత నితీశ్ కుమార్ గేర్ మార్చారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను కలుసుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షాల ఐక్యత గురించి చర్చించారు. కేంద్రంలో బలంగా ఉన్న నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలువరించాలంటే ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. ప్రతిపక్షాలు కలిసి కట్టుగా ఉంటూ కేంద్రం నుంచి మోదీ సర్కారును సాగనంపాలని నిర్ణయించినట్లు సమావేశానంతరం కేజ్రీవాల్, నితీశ్ చెప్పారు. కేజ్రీవాల్ మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి ధీటైన జాతీయ ప్రత్యామ్నాయం ఆమ్ ఆద్మీ పార్టీదేనని కేజ్రీవాల్ విశ్వాసం. ఇదే విషయాన్ని ఆయన అనేక వేదికలపై ప్రకటించారు. ఇప్పటికే ఆప్ ఢిల్లీ, పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించి, గోవా, గుజరాత్‌లో ఉనికి చాటుకుని జాతీయ పార్టీ హోదా కూడా పొందింది. ప్రతిపక్షాలకు కాంగ్రెస్ నేతృత్వం అనే అంశంపై కేజ్రీవాల్ నితీశ్‌తో ఏకీభవించే అవకాశాలు తక్కువేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అంతకు ముందు నితీశ్ ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే (ఢిల్లీ నివాసానికి వెళ్లారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వీరికి స్వాగతం పలికారు. అనంతరం అందరూ గ్రూప్ ఫొటోలు దిగారు. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాల మధ్య ఐక్యతను సాధించడంపై

(మిగతా 2లో)





## బీబీసీ ఇండియా పై తాజాగా ఈడి కేసు

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**

ప్రముఖ మీడియా సంస్థ బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ ఇండియా పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా కేసు నమోదు చేసింది. విదేశీ నిధుల వ్యవహారంలో బీబీసీ ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిపింది. ఈ కేసు విచారణతో భాగంగా ఆర్థిక లావాదేవీల వివరాలను సమర్పించాలని బీబీసీ ఇండియాను ఈడీ ఆదేశించింది. అదేవిధంగా విదేశీ రెమిటెన్సుల వివరాలను కూడా పరిశీలిస్తున్నట్లు ఈడీ వర్గాలు తెలియజేశాయి.

(మిగతా 2లో)

## మాఫియా డాన్ అతీక్ కొడుకు అసద్ ఎన్‌కౌంటర్

**లక్నో :**



యూపీ మాఫియా డాన్ అతీక్ అహ్మద్ కొడుకు అసద్‌ను ఎన్‌కౌంటర్ చేశారు. ఉమేష్ పాల్ హత్య కేసులో అతడి హస్తమూ ఉందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ క్రమంలోనే అసద్‌ను ఎన్‌కౌంటర్ చేసింది. డీఎస్‌పీతో కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించింది. అసద్‌తో పాటు అతని సన్నిహితుడు గులాంపై కాల్పులు జరిపింది. వాళ్ల నుంచి తుపాకులు స్వాధీనం చేసుకుంది. వీరిద్దరి ఆచూకీ తెలిపిన వారికి రూ.5 లక్షల రివార్డు ఇస్తామని ఇప్పటికే యూపీ పోలీసులు ప్రకటించారు. ఈలోగా వాళ్ల జాడ తెలుసుకుని వెంటాడిన పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఉమేష్ పాల్‌ను హత్య జరిగిన సమయంలో సీసీటీవీలో అసద్ కూడా కనిపించాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. పోలీసులు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. చివరకు వాళ్ల ఆచూకీ కనుక్కొని ఎన్‌కౌంటర్ చేసింది. ముందు గులాం పోలీసులపై ఫైరింగ్ జరిపాడు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ ప్రతిదాడులకు దిగింది. ఈ క్రమంలోనే అసద్, గులాం ప్రాణాలు విడిచారు. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం..ఉమేశ్ పాల్ హత్య తరవాత అసద్ లక్నోకి పారిపోయాడు. అక్కడి నుంచి కాన్పూర్, మీరట్‌కు వెళ్లి చివరకు ఢిల్లీకి చేరుకున్నాడు. అక్కడి నుంచి మధ్యప్రదేశ్‌కు పారిపోవాలని చూశాడు. ఝాన్సీ ప్రాంతానికి వచ్చిన అసద్ అక్కడి నుంచి మధ్యప్రదేశ్ బార్డర్‌కు బైక్‌పై వెళ్లే క్రమంలోనే ఎన్‌కౌంటర్‌కు గురయ్యాడు. అతిక్ అహ్మద్ గ్యాంగ్‌లోనే ఓ ఇన్‌ఫార్మర్ అసద్ ఆచూకీని పోలీసులకు చెప్పాడు. ఆ ఆధారంగా 12 మంది పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఝాన్సీలోని బబీనా రోడ్ వద్ద దాదాపు 42 రౌండ్ల కాల్పులు జరిగాయి. ఆ కాల్పుల్లోని అసద్, గులాం చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్‌పై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ని అభినందించారు. అటు యోగి ఆదిత్యనాథ్‌పైనా ప్రశంసలు కురుస్తున్నాయి. తండ్రిని అరెస్ట్ చేయడమే కాకుండా కొడుకుని కూడా ఎన్‌కౌంటర్

(మిగతా 2లో)



## విశాఖ ఉక్కు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

**ప్రజాతపన, హైదరాబాద్ :**

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదంటూ కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే చేసిన ప్రకటనపై జనసేన

(మిగతా 2లో)

## సుఖేష్ ఎవరు... కవిత ప్రశ్న

**ప్రజాతపన, హైదరాబాద్ :**



మనీలాండరింగ్ కేసులో జైలులో ఉన్న సుఖేష్ చంద్రశేఖర్.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితతో చాట్ చేశానని, కొన్ని స్క్రీన్ షాట్స్ లీక్ చేశాడు. ఈ చాట్ పై ఎమ్మెల్సీ కవిత స్పందించారు. కేసీఆర్ ను ఎదుర్కొనే ధైర్యం లేక తనపై దాడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఫేక్ చాట్ లతో తన మీద దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సుఖేష్ చంద్రశేఖర్ తో తనకు ఎలాంటి పరిచయం లేదని కవిత తెలిపారు. గత కొన్ని రోజులుగా తెలంగాణ ప్రభుత్వం, బీఆర్‌ఎస్ పార్టీ మీద, మరీ ముఖ్యంగా తన మీద ఉద్దేశపూర్వకంగా కొందరు తప్పుడు వార్తలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ

(మిగతా 2లో)

## మిసెస్ ఇండియా గ్లోబల్ 2023 గ్రాండ్ ఫినాలే లో క్యాట్ వాక్ తో అదరకొట్టిన శ్రీమతులు

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**

కేరళ కి చెందిన పూజ మోహన్ మిసెస్ ఇండియా గ్లోబల్ 2023 టైటిల్ గెలుచుకున్నది. తెలంగాణా కి చెందిన అంకిత ఠాకూర్ రాయ్ మిసెస్ ఇండియా గ్లోబల్ సౌత్ టైటిల్ గెలుసుకుంది.

మిసెస్ అవని అవస్తీ మరియు మెరిన్ జాన్ మణప్పురం మిసేస్ ఇండియా గ్లోబల్

(మిగతా 2లో)



## అత్యంత ఎత్తయిన యుద్ధ క్షేత్రం సియాచిన్ గ్లేసియర్

(మొదటిపేజీ తరువాయి)

సందర్శించారు. ఈ విధంగా సైనికులను కలిసిన తొలి భారత రాష్ట్రపతిగా, రక్షణ దళాల సుప్రీం కమాండర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. పంచంలో అత్యంత ఎత్తయిన యుద్ధ క్షేత్రం సియాచిన్ గ్లేసియర్. 1984 నుంచి భారత్-పాక్ ఇక్కడ పోరాడుతున్నాయి. సముద్ర మట్టానికి 6 వేల మీటర్ల ఎత్తులో ఇరు దేశాలు శాశ్వతంగా సైన్యాన్ని ఇక్కడ మోహరిస్తున్నాయి. ఆవాస యోగ్యం కాని ఈ ప్రాంతంలో 2,000 మందికిపైగా సైనికులు ప్రాణాలు కోల్పోయారు.

## బీబీసీ ఇండియా పై తాజాగా ఈడి కేసు

(మొదటిపేజీ తరువాయి)

కాగా బీబీసీ ఇండియాకార్యాలయంలో గతంలో ఐటీ శాఖ తనిఖీలు నిర్వహించిన సంగతి విదితమే. అయితే ఆ తనిఖీలను 'సోదాలు కాదని, సర్వే' అని అధికారులు తెలిపారు. గోద్రామారణకాండ వెను క అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీప్రమేయం ఉందంటూ గతంలో బీబీసీ ఓ వివాదాస్పద డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. ఇది జరిగిన కొద్ది రోజులకే ఈ తనిఖీలుచోటుచేసుకోవడం గమనార్హం. గుజరాత్ అల్లర్లలో ప్రదాని మోదీ హస్తం ఉందని 'ఇండియా: ద మోదీ క్వశ్చన్' పేరిట రెండు భాగాలుగా విడుదలైన డాక్యుమెంటరీలో బీబీసీ పేర్కొంది. కాగా దీనిపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అల్లర్లపై న్యాయస్థానాల్లో మోదీకి క్లీన్‌చిట్‌లభించాక కూడా ఇలా అభాండాలు మోపడమేమిటని భారతీయ జనతా పార్టీ తీవ్ర అభ్యంతరంవ్యక్తం చేసింది.

## గ్యాంగ్‌స్టర్ అతీఖ్ అహ్మద్ కుమారుడు అసద్ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

చేయించాడంటూ అందరూ అభినందిస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ లో గ్యాంగ్ స్టర్ అతీక్ అహ్మద్ కొడుకు అసద్ అహ్మద్ ఎన్ కౌంటర్ పై రాజకీయ దుమారం రేగుతోంది. 2005 బీఎస్పీ ఎమ్మెల్యే హత్య కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న ఉమేష్ పాల్ ను ఫిబ్రవరిలో హత్య చేశారు. ఈ కేసులో అతీక్ అహ్మద్, అతని కుటుంబ సభ్యులు నిందితులుగా ఉన్నారు. కేసు ట్రయల్స్ దగ్గర పడటంతో సాక్షి అయిన ఉమేష్ పాల్ ను హత్య చేశారు. ఈ హత్యలో అతీక్ అహ్మద్ కుమారుడు అసద్ తో పాటు మరో గులాం అనే వ్యక్తి ప్రధాన నిందితులుగా ఉన్నారు. తాజాగా గురువారం ఝాన్సీ సమీపంలో జరిగిన ఎన్ కౌంటర్ లో వీరిద్దరు మరణించారు. అయితే ఇది బూటకపు ఎన్ కౌంటర్ అని, బీజేపీ కోర్టులపై నమ్మకం లేదని ప్రతిపక్ష నేత, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, సీఎం యోగీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇదిలా ఉంటే ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఈ ఎన్ కౌంటర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ నిజామాబాద్ లో మాట్లాడుతూ.. జునైద్, నసీర్ లను చంపిన వారిని కూడా బీజేపీ ఇలాగే కాల్చి చంపుతుందా..? అని ప్రశ్నించారు. ఫిబ్రవరిలో గో సంరక్షకులచే ఈ ఇద్దరు వ్యక్తులు చంపబడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. హర్యానాలో ఓ కారులో జునైద్, నసీర్ కాలిన మృతదేహాలు ఉన్నాయి. మతం పేరుతో బీజేపీ ఎన్ కౌంటర్లు చేస్తుంది అని ఓవైసీ మండిపడ్డారు. మీరు చట్ట పాలనను నిర్వీర్యం చేయాలనుకుంటున్నారు, రాజ్యాంగాన్ని ఎన్ కౌంటర్ చేస్తున్నారని విమర్శించారు. మనకెందుకు కోర్టులు, చట్టం, సీఆర్పీసీ (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్), ఐపీసీ (ఇండియన్ పీనల్ కోడ్) ఎందుకు ఉన్నాయి అని ప్రశ్నించారు. ఇలా ఎన్ కౌంటర్ల ద్వారా హత్యలు చేయాలనుకుంటే న్యాయమూర్తులు ఎందుకు ఉన్నారని అన్నారు. హంతకులను పట్టుకోవడం మీ పని, ఎవరైనా చంపితే జైలుకు పంపండి అని అన్నారు.

## విశాఖ ఉక్కు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. కేంద్రమంత్రి ప్రకటన ఆశాజనకంగా ఉందన్నారు. విశాఖ ఉక్కు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వానికి విశాఖ ఉక్కును కాపాడాలనే చిత్తశుద్ధి లేదని,విశాఖ ఉక్కు అనేది తెలుగువారి భావోద్వేగాలతో ముడిపడిన పరిశ్రమ అని వ్యాఖ్యానించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో... ప్రాంతాలకు అతీతంగా సాగిన ఉద్యమాల ఫలితంగా సిద్ధించినదే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తావించారు. ఇంతటి ఘన నేపథ్యమున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఎప్పుడూ కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉండాలన్నది జనసేన పార్టీ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఈ పరిశ్రమ ప్రయివేటీకరణ అంశం ప్రకటన వచ్చినప్పుడు స్పందించి ఢిల్లీ వెళ్ళి బీజేపీ అగ్రనాయకత్వాన్ని కలిసినప్పుడు వారు సానుకూలంగానే పవన్ కళ్యాణ్ చెప్పారు. ఆ స్పందన ఎంతో ఆశావాహంగా కనిపించిందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాని కలిసి విశాఖ ఉక్కుతో తెలుగు ప్రజలకున్న భావోద్వేగ బంధాన్ని తెలియచేసి ఈ పరిశ్రమను ప్రత్యేకంగా చూడాలని కోరానని ప్రస్తావించారు. ఈ రోజు కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే 'విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఇప్పటికిప్పుడు ప్రైవేటుపరం చేయాలనుకోవడం లేదు. దీనిపై ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదు' అని చేసిన ప్రకటన హర్షణీయమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎందరో రైతులు తమ భూములను త్యాగం చేశారని, ఇందులో కొందరికి ఇప్పటికీ సెటిల్మెంట్ కాలేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిశ్రమపై రాష్ట్ర పాలకులు సైతం ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వారికి తొలి నుంచీ చిత్తశుద్ధి లోపించిందని విమర్శించారు. జనసేన పక్షాన స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా నిలవడంతోపాటు భారీ బహిరంగ సభ నిర్వహించి రాష్ట్ర పాలకులు అఖిలపక్షాన్ని తీసుకొని కేంద్ర ప్రభుత్వం దగ్గరకు వెళ్లాలని విజ్ఞప్తి చేసినా వైసీపీ పాలకులు స్పందించలేదని మండిపడ్డారు. జనసేన పార్టీ ప్రతి సందర్భంలో కేంద్ర నాయకత్వం, కేంద్ర మంత్రులతో చర్చించినప్పుడు విశాఖ ఉక్కును పరిరక్షించాలని బలంగా చెప్పామని పవన్ అన్నారు. కొద్ది రోజుల కిందట పొరుగు రాష్ట్రం ఈ అంశంలో స్పందించింది. దీని వెనక ఉన్న రాజకీయ ప్రయోజనాలు, నేపథ్యాలపై వైసీపీ పాలకులు విమర్శలు చేస్తున్నారే తప్ప పరిశ్రమ కాపాడుతామనే మాట చెప్పలేకపోయారని వైసీపీ నాయకులకుపై పవన్ విమర్శించారు. చిత్తశుద్ధి లేని రాష్ట్ర పాలకుల వల్ల విశాఖ ఉక్కు పరిరక్షణ అంశం ముందుకు వెళ్లలేదని వాపోయారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి చేసిన ప్రకటన కొత్త ఆశలు రేపిందని, జనసేన పార్టీ తొలి నుంచి ఈ పరిశ్రమను పరిరక్షించాలనే కోరుతోందని, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌ను బలోపేతం చేయాలని నిర్ణయించిన దృష్ట్యా విశాఖ ఉక్కు బలపడుతుందని భావిస్తున్నానని పవన్ కళ్యాణ్ చెప్పారు.

## మిసెస్ ఇండియా గ్లోబల్ 2023 గ్రాండ్ ఫినాలే లో క్యాట్ వాక్ తో అదరకొట్టిన శ్రీమతులు

(మొదటిపేజీ తరువాయి)

2023 పోటీలో రన్నరప్ గా నిలిచారు. మంగళవారం రాత్రి కోచి లోని మెరిడియన్ హోటల్ లో ఫైనల్స్ ముగిశాయ హైదరాబాద్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మణపురం, యూనిక్యూ టైమ్స్ మరియు పెగసుస్ సంస్థల ప్రతినిధులు ఈ పోటీల వివరాలు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల నుంచీ పెద్ద సంఖ్యలో శ్రీమతలు దరఖాస్తు చేసుకున్న ఈ పోటీలో పలు రాష్ట్రల కి చెందిన 20 మంది అందమైన యువతులు టైటిల్ పోరుకు ఎంపికయ్యారు. హోరాహోరీగా తలపడ్డారు. తుది పోరులో కేరళ కి చెందిన పూజ మోహన్ మిసెస్ ఇండియా గ్లోబల్ 2023 మరియు తెలంగాణా కి చెందిన అంకిత ఠాకూర్ రాయ్ మిసెస్ ఇండియా గ్లోబల్ సౌత్ టైటిల్ గెలుసుకుంది.

# గేర్ మార్చిన నితీశ్ కుమార్

(మొదటిపేజీ తరువాయి)

చర్చించారు. కాంగ్రెస్ అనుకూల పార్టీలతో పాటు కాంగ్రెసేతర పార్టీలను కూడా సంప్రదించాలని నిర్ణయించారు. ప్రధాని అభ్యర్థి ఎవరనేదానికన్నా, ప్రతిపక్షాలన్నింటినీ ఒకేతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా చర్చలు సాగినట్లు సమాచారం. బీహార్‌లో ప్రస్తుతం జేడియూ-ఆర్జేడీ-కాంగ్రెస్ మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారు కొనసాగుతోంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 74, జేడియూ 43 స్థానాల్లో గెలుపొందగా ఆర్జేడీ 75 స్థానాల్లో, కాంగ్రెస్ 19 చోట్ల, ఇండిపెండెంట్లు 31 మంది గెలిచారు. 2015 ఎన్నికలతో పోలిస్తే బీజేపీ 21 చోట్ల అదనంగా గెలవగా, జేడియూ 28 చోట్ల ఓడిపోయింది. 2020 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జేడియూ-బీజేపీ ఎన్డీయే సర్కారును ఏర్పాటు చేశాయి. అయితే ఆ తర్వాత కొంత కాలానికి 2022 ఆగస్టులో నితీశ్ బీజేపీకి గుడ్‌బై చెప్పి ఆర్జేడీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి నితీశేనని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వానికి మద్దతు కూడా ఇచ్చారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. రాహుల్‌పై అనర్హత వేటు పడటంతో కాంగ్రెస్ తరపున ప్రధాని అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వాన్ని ఇష్టపడని అనేక పార్టీలున్నాయి. కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే యూపిఏలో కొనసాగుతున్నారు. ఎన్సీపీ, ఉద్దవ్ శివసేన ఇప్పటికే కాంగ్రెస్ కూటమిలోనే ఉన్నాయి. స్టాలిన్ కూడా యూపిఏ భాగస్వామిగానే ఉన్నారు. బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ దాదాపు అన్ని కూటములకూ దూరంగా ఉన్నారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వైఖరి ఈ ఏడాది ఆఖరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టి స్పష్టమౌతుంది. ఇక మమత పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌కు దాదాపు ఉనికి లేకుండా చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ గెలిచేసరికి బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్‌కు సహకరించడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారని, భవిష్యత్తులో తాను కాంగ్రెస్‌తో చేతులు కలపబోనని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలన్నీ ఎవరికి వారే అన్నట్లుగా ఉండటంతో ముందుముందు నితీశ్‌కు అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. అయితే సుదీర్ఘమైన అనుభవమున్న నేతగా, క్లీన్ ఇమేజ్ ఉన్న నేతగా పేరుండటంతో తన చరిష్మాతో విపక్షాలన్నింటినీ నితీశ్ ఏకతాటిపైకి తెస్తారని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# సుఖేష్ ఎవరు... కవిత ప్రశ్న

(మొదటిపేజీ తరువాయి)

కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణ, కేసీఆర్ జాతీయ స్థాయి కార్యాచరణను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక తెలంగాణ వ్యతిరేకులు కొందరిని గుప్పిట్లో పెట్టుకొని పేపర్లు, టీవీ ఛానెళ్లు, యూ ట్యూబ్ మీడియాల ద్వారా పనిగట్టుకొని బీఆర్ఎస్ పార్టీ మీద ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఆర్థిక నేరగాడు, ఒక అనామక లేఖను విడుదల చేయడం, దాని వెంటనే బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడం, దాని తదనంతరమే ఎంపీ అర్వింద్ బీజేపీ టూల్ కిట్ లో భాగంగా పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో బురదజల్లే కార్యక్రమాన్ని ఒక ప్రణాళిక ప్రకారం చేస్తున్నారన్నారు."అసలు సుఖేష్ చంద్రశేఖర్ అనే వ్యక్తితో నాకు పరిచయం కూడా లేదు. అతనెవరో కూడా నాకు తెలియదు. కానీ వాస్తవాలు ఏవీ పట్టించుకోకుండా, కొన్ని మీడియా సంస్థలు అత్యుత్సాహంతో, పనిగట్టుకొని తప్పుడు వార్తలు ప్రచురించాయి. ఇదివరకు నా మొబైల్ ఫోన్ల విషయంలో కూడా ఇలాగే తొందరపడి వార్తలు రాసి తరువాత తోక ముడిచారు. మళ్లీ ఇప్పుడు క్రిమినల్ సుఖేష్ ను పావుగా వాడుకొని తెలంగాణ ప్రభుత్వాన్ని, బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ కుటుంబ సభ్యులను బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారు. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్న చందంగా, అదుగో పులి అంటే ఇదిగో తోక అన్నట్లు తయారైంది ప్రస్తుతం కొన్ని మీడియా సంస్థల తీరు. ఇది అత్యంత దురదృష్టకరం." - ఎమ్మెల్సీ కవిత "పాత్రికేయులు కనీస విలువలు పాటించకపోవడం అత్యంత బాధాకరం. రాజకీయ ఎజెండాలో మీడియా సంస్థలు కూడా పావుగా మారడం, బీఆర్ఎస్ పార్టీ పై అడ్డగోలుగా తప్పుడు ప్రచారం చేయడం చూస్తే ఎన్నికల ఏడాదిలో మరెంతో దిగజారి వార్తలు ప్రసారం చేస్తారని తెలంగాణ సమాజం గ్రహించాలి. జాగ్రత్త పడాలి. తెలంగాణ ప్రజలు విజ్ఞులు పాలు ఏంటో, నీళ్లేంటో తెలిసిన చైతన్య జీవులు. నిజం నిలకడ మీద తెలుస్తుంది. కేసీఆర్ మీద కక్షతో, అన్ని రంగాల్లో తెలంగాణను దేశంలో ముందు వరుసలో నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వం మీద ఈర్ష్యతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని తెలంగాణ సమాజం తప్పకుండా తరిమి కొడుతుంది. నా మీద బురద జల్లేందుకు కొందరు ఇస్తున్న అగ్ర ప్రాధాన్యత, దమ్ముంటే, నిజాయితీ ఉంటే నా వివరణకి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. తెలంగాణ బిడ్డలం తలవంచం తెగించి కొట్లాడుతాం" - ఎమ్మెల్సీ కవిత

# అనూష హంతకుడికి జీవిత ఖైదు

**గుంటూరు:**

నర్సరావుపేటలో ఓ యువతిని హత్య చేసిన ప్రేమోన్మాదికి కోర్టు జీవితఖైదు విధించింది. సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుడు విష్ణువర్ధన్ రెడ్డికి జీవిత ఖైదు విధిస్తూ నరసరావుపేట 13 వ అదనపు జిల్లా కోర్టు గురువారం తీర్పునిచ్చారు. ప్రేమకు, స్నేహానికి తేడా తెలియని ? సైకో యువతి నిండు ప్రాణాలు బలి తీసుకున్నాడు...ఇద్దరి మధ్య ఉన్న చనువు, అభిమానాన్ని కూడా మర్చి పోయి కసి తీరా గొంతు నులిమి చంపాడు...తనని వదిలేయమని తన మీద కేవలం స్నేహం మాత్రమే ఉందని...ప్రేమ లేదని చెప్పడంతో ఒక్క సారిగా మృగంగా మారి మరీ ప్రాణం తీసాడు...ఈ కేసు పూర్వాపరాల, సాక్ష్యాధారలు పరిశీలించిన న్యాయస్థానం హత్య జరిగినట్లు నిర్ధారించింది. విష్ణువర్ధన్‌రెడ్డి, అనూష మంచి ఫ్రెండ్స్. నరసరావుపేట లోని కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నారు. కొంత కాలంపాటు అనుష, విష్ణువర్ధన్ రెడ్డి స్నేహంగా ఉన్నారు. స్నేహమే కానీ వీరిదిదరి మధ్య ప్రేమ వ్యవహారం లాంటిది లేదు. ఈ క్రమంలో అనూష తమ కాలేజీ లోనే చదువుతున్న మనోజ్ అనే వ్యక్తితో స్నేహంగా ఉండటం సహించలేక పోయాడు విష్ణువర్ధన్ రెడ్డి. 23-02-2021 న అనూష, విష్ణు వర్ధన్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సంబంధం లేక పోయినా ఆమెపై అనుమానంతో రగిలిపోయాడు. తనకు దక్కని అనూష ఇంకెవరికీ దక్కకూడదని అనుకున్నాడు. మరుసటి రోజు అంటే 24-02-2021 నఉదయం 10.30 గంటల సమయంలో అనూష రావిపాడు రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ వద్ద బస్సు దిగగానే ఆటోలో ఆమెను బలంతంగా ఎక్కించాడు. తర్వాత రావిపాడు పెట్రోలు బంక్ వద్ద తీసుకు వెళ్ళాడు. ఆనూష గొడవ చేయకుండా ఉండేందకు ఆమాయకంగా నటించాడు.. ఆమెతో మాట్లాడాలంటూ ప్రాధేయపడి పాలపాడు వైపు వెళ్లే గోవిందాపురం మైనర్ కాల్వ కట్ట వద్ద గల సుబాబుల్ తోటకు సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లాడు. మనోజ్ గురించి ప్రశ్నించాడు. మీ ఇద్దరికి ఉన్న సంభంధం ఏమిటని ప్రశ్నించాడు. ఆమె చెప్పిన ఆన్సర్ తో రగిలిపోయిన విష్ణువర్ధన్ రెడ్డి ఆమెపై దాడి చేశాడు. కిందపడిన అనూషను గొంతు నులిమి చంపేశాడు. అనంతరం హత్యకు సంబంధించిన ఆధారాలను మాయం చేయడం కోసం మృతదేహాన్ని చేతులతో మోసుకెళ్లి కొద్దిదూరంలో గోవిందాపురం మైనర్ కాల్వలో పడేశాడు. తర్వాత మృతదేహంపై పాత గోనెసంచి,గడ్డి కప్పాడు. అక్కడి నుండి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.. హత్యా కేసును నమోదు చేసుకున్న పోలీసులు...కేసుకు సంబంధించిన ప్రతి చిన్న ఆధారాన్ని వదల కుండా ఇన్వెస్టిగేషన్ చేసారు...కీలక ఆధారాలు సేకరించి న్యాయస్థానం ముందు ఉంచారు...

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం వెనక్కు తగ్గిందా?

**న్యూ ఢిల్లీ :**

కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్‌లో కొన్ని కొత్త విభాగాలు ప్రారంభిస్తున్నామని, స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేసే పనిలో ఉన్నామని ఫగ్గన్ సింగ్ వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. బిడ్‌లో తెలంగాణ సర్కార్ పాల్గొనడం ఓ ఎత్తుగడ మాత్రమేనని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే అభిప్రాయపడ్డారు. విశాఖ ఉక్కు కర్మాగారం (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-ఆర్ఐఎన్ఎల్) ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాలని తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్వహణకు మూలధన సేకరణలో భాగంగా ఆసక్తి వ్యక్తీకరణ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్-ఈవోఐ)ను ఆహ్వానించిన నేపథ్యంలో.. దాని బిడ్డింగ్‌లో పాల్గొనాలని నిశ్చయించుకుందని వార్తలొచ్చాయి. బిడ్డింగ్‌ను దక్కించుకోగలిగితే ఇటు పాలనాపరంగా.. అటు రాజకీయంగా కేంద్రంలోని బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టినట్లవుతుందని.. ప్రైవేటీకరణను అడ్డుకున్నామని రెండు తెలుగు రాష్ట్రాల్లోనే గాక దేశమంతా మైలేజీ వస్తుందని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ భావిస్తున్నారని ఇటు మీడియాలో, అటు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. గత నెల 27న ఈవోఐ విడుదల అయింది. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం వరకు ఆసక్తిగల కంపెనీలు బిడ్లు దాఖలు చేయవచ్చు. ఈవోఐ బిడ్లలో ప్రభుత్వాలు నేరుగా పాల్గొనేందుకు వీల్లేదు. కంపెనీలు మాత్రమే పాల్గొనాలి. ఈ నేపథ్యంలో.. తెలంగాణ సర్కారుకు సింహభాగం వాటా ఉన్న సింగరేణి సంస్థను రంగంలోకి దించాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారని వార్తలు గుప్పుమన్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం అమ్మేయడానికి యత్నిస్తుంటే.. దానిని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణా సీఎం కేసీఆర్ సింగరేణి కాలరీస్‌తో బిడ్ వేయిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే... అసలు వాస్తవం వేరు. ఇప్పుడు జరుగుతున్న ప్రక్రియకు, ప్రైవేటీకరణకు సంబంధం లేదు. 'ముడిపదార్థాల సరఫరా లేదా వర్కింగ్ క్యాపిటల్‌ను సమకూర్చితే... దానికి సమానమైన విలువగల స్టీల్ ఇస్తాం! ఆసక్తి ఉన్న వాళ్లు ముందుకు రండి' అని విశాఖ స్టీల్స్ 'ఆసక్తి వ్యక్తీకరణ' (ఈవోఐ) ప్రకటన జారీ చేసింది. అంతే తప్ప.. ఇది స్టీల్ ప్లాంట్ అమ్మకానికి కానే కాదు. ఈవోఐలో ఏముందంటే.. "వర్కింగ్ క్యాపిటల్ లేదా ముడి పదార్థాలు సరఫరా చేస్తే.. దానికి బదులుగా స్టీల్ ఇస్తాం" అంటూ గతనెల 27వ తేదీన విశాఖ ఉక్కు యాజమాన్యం ఈవోఐ వెలువరించింది. ఇందులో... "ఉక్కు, ఉక్కు ఉత్పత్తికి సంబంధించిన కంపెనీలతో భాగస్వామ్యం కోసం ఎదురు చూస్తున్నాం" అని తెలిపింది. స్టీల్ తయారీ సంస్థలతో అనుబంధం, అనుభవం ఉన్నవారెవరైనా బిడ్ వేయవచ్చునని స్పష్టం చేసింది. "స్టీలు తయారీకి సంబంధించిన ముడిపదార్థాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ (ఉదాహరణకు కోకింగ్ కోల్/బ్లాస్ట్ ఫర్నేస్ కోల్, ఇనుప ఖనిజం) సరఫరా చేసి... దానికి బదులుగా స్టీల్ ఉత్పత్తులను తీసుకోవచ్చు. లేదా... వర్కింగ్ క్యాపిటల్ (నగదు) సమకూర్చితే దానికి బదులుగా స్టీల్ ఉత్పత్తులను సరఫరా చేస్తాం" అని ఈవోఐలో పేర్కొన్నారు. స్టీల్‌ను ఏ ధరకు ఇస్తారనే విషయాన్ని ఇందులో వెల్లడించలేదు. అయితే... మార్కెట్ రేటుకంటే తక్కువకే స్టీలు ఇస్తామని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉక్కు తయారీకి అవసరమయ్యే ముడిపదార్థాల రంగంలో ఉన్న కంపెనీలు మాత్రమే ఈవోఐకి ముందుకురావాలని ఇందులో స్పష్టంగా చెప్పారు. ఏప్రిల్ 15వ తేదీలోపు స్పందించాలని కోరారు. సింగరేణి వల్ల విశాఖ ఉక్కుకు ఒరిగేదేమిటని జోరుగా చర్చ..'విశాఖ ఉక్కు'లో అడుగుపెట్టి రాజకీయ ప్రయోజనం పొందడమే కేసీఆర్ వ్యూహమనే విమర్శలు వినిపిస్తుండగా.. అసలు, సింగరేణి వల్ల విశాఖ ఉక్కుకు ఒరిగేదేమిటనే చర్చ కూడా జరుగుతోంది.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# కన్నాకు ఏపీ టీడీపీఅధ్యక్ష పదవి ?

**గుంటూరు:**



భారతీయ జనతా పార్టీ నుంచి టీడీపీలో చేరిన కన్నా లక్ష్మినారాయణకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధమయింది. ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. ఎన్నికల రాజకీయాల్లో ఆయన వ్యూహాలను ఉపయోగించుకోవాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. అందుకే ఓ కీలక పదవిని ఆయనకు అప్పగించబోతున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కన్నా లక్ష్మినారాయణ...ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నే కీలక నేతగా వ్యవహరించిన ఆయన ఇటీవలే తెలుగు దేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వెంటనే టీడీపీ నేతలందరితో కలిసి పని చేసేందుకు అవసరమైన గ్రౌండ్ రెడీ చేసుకున్నారు. తన రాక వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదని చేతలతో చూపించారు. అందరి ఇళ్లకు వెళ్లి కలిశారు. అందర్నీ పిలిచి తన ఇంట్లో విందు కూడా ఇచ్చారు. టీడీపీ నేతలు ఎవరు పిలిచినా వెళ్లి వారి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గుంటూరులో రాయపాటి కుటుంబంతో ఉన్న విభేదాలను సైతం పక్కన పెట్టేశారు. ఇప్పుడు గుంటూరు జిల్లాలో కన్నా లక్ష్మినారాయణ కు టీడీపీలో వ్యతిరేకులెవరూ లేరు. ఇప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కన్నా లక్ష్మినారాయణకు కొన్ని కీలక బాధ్యతలు ఇవ్వాలనుకుంటున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 అసెంబ్లీ స్థానాలు, మూడు పార్లమెంట్ స్థానాలు గెలిపించేందుకు కన్నాకు బాధ్యతలను అప్పగించారని చెబుతున్నారు. ఇప్పుడున్న పార్టీ నేతలు సైతం కన్నాకు టచ్ లోకి వెళ్లారు. వారంతా కన్నా కు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సుదర్గ కాలం నుంచి రాజకీయాల్లో ఉన్నా.. మంత్రిగా కూడా అత్యధిక కాలం పని చేశారు. రోశయ్య సీఎం పదవికి రాజీనామా చేసిన తర్వాత ముఖ్యమంత్రి రేసులో కన్నా పేరు కూడా వినిపించింది. తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో రాజకయాలు మారిపోయాయి. ఆయన ఒడి దుడుకులు ఎదుర్కొన్నప్పటికి ఇప్పుడు ఫుల్ ఫామ్ లోకి వచ్చారు. టీడీపీలో ఆయన యాక్టివ్ అయ్యారు. గుంటూరు జిల్లాలో అన్ని స్థానాలను టీడీపీ గెలిచేలా ఆయన వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. కన్నా లక్ష్మినారాయణ సీనియర్ నేత మాత్రమే కాదు... ఎన్నికల్లో గెలుపోటముల్ని నిర్దేశిస్తాయని భావిస్తున్న కాపు సామాజికవర్గం నేత. ఆయనకు తన వర్గంలో మంచి పలుకుబడి ఉంది. అందుకే ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా అవకాశం ఇవ్వవొచ్చన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బాధ్యతలు చేపట్టి మూడేళ్లు అవుతోంది. దీంతో అధ్యక్షుడి మార్పు ఉంటుందని అంటున్నారు. ఒక వేళ అధ్యక్ష పదవి కాకపోయినా కన్నా రాజకీయ అనుభవాన్ని గరిష్టంగా ఉపయోగించుకోవడానికి కీలకమైన బాధ్యతలే చంద్రబాబు ఇవ్వనున్నట్లుగా చెబుతున్నారు.

# వివేకా క్యారెక్టర్ పై మరక...?

**హైదరాబాద్:**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి దాదాపు నాలుగేళ్లు కావస్తుంది. అయితే ఆయన హత్యకు గల కారణాలు ఇంతవరకూ బయటకు తెలియలేదు. కానీ వైఎస్ వివేకాపై మాత్రం ఒకటి కాదు రెండు కాదు అనేకమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవి నిరాధారమైన ఆరోపణలు కావచ్చు. నిజమే కావచ్చు. కాని వైఎస్ వివేకా మంచి మనిషి అని ప్రజలకు తెలుసు. ప్రజాసమస్యల పట్ల ఆయనకు అవగాహన ఉంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన సోదరుడిపై నమ్మకం ఉంచి ఆయనకు తగిన రీతిలో ప్రాధాన్యత కల్పించారు. అయితే జగన్ పార్టీ పెట్టిన తర్వాత ఆయన కాంగ్రెస్ లోనే మంత్రి పదవి కోసం కొనసాగడం కొంత చర్చనీయాంశమైనా చివరకు వైసీపీలో చేరి జగన్ కు అండగా నిలిచారు. శాసనమండలి సభ్యుడిగా, పార్లమెంటు సభ్యుడిగా వైఎస్ వివేకానందరెడ్డి పనిచేశారు. పులివెందులతో పాటు కడప జిల్లాలో మంచి పేరున్న రాజకీయ నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. అయితే వివేకా 2019 మార్చి 15వ తేదీన హత్యకు గురయ్యారు. ఎంతగా అంటే గొడ్డలి, కత్తులతో ఆయనను దుండగులు నరికారు. అయితే హత్య జరిగిన తీరు చూస్తే రాజకీయ కోణం కన్నా వ్యక్తిగతమైన శత్రుత్వమే ఆయను అలా కసి తీరా చంపి ఉంటారన్నది ప్రతి ఒక్కరికీ తెలుసు. అది స్థలం వివాదం కావచ్చు. బెంగళూరులో ఒక భూమి సెటిల్ మెంట్ వివాదంలో ఈ హత్య జరిగినట్లు కూడా తొలుత ఆరోపణలు వినిపించాయి. సెటిల్ చేసిన తర్వాత తమకు డబ్బులు ఇవ్వలేదన్న కసితో



దుండగులు పగ పట్టి హత్య చేశారని చెబుతారు కొందరు. అందులో నిజానిజాలు ఏమిటో ఇంత వరకూ తేలలేదు. కోట్ల రూపాయల సెటిల్ మెంట్ జరిగింది కాబట్టి నిందితులు అంతకసిగా పొడిచి పొడిచి చంపి ఉండవచ్చని అనుకున్నారు కూడా. కానీ రాను రాను పెద్దాయనపై అక్రమ సంబంధాలు అంటకడుతూ ప్రచారాలు జరుగుతున్నాయి. 67 ఏళ్ల వయసులో వైఎస్ వివేకా హత్యకు గురయ్యారు. ఆయన గతంలోనే ఒక ముస్లిం మహిళతో సంబంధం ఉందని, 2011లో ఆమెను వివాహం చేసుకున్నారని, షేక్ పేరు కూడా మార్చుకున్నారని, మహ్మద్ అక్బర్ గా మార్చుకున్నారని, మతం కూడా మార్చుకున్నారని స్వయానా వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. వారికి ఒక కుమారుడు కూడా ఉన్నారన్నారు. ఆస్తి తగాదాల కారణంగానే బాబాయి హత్య జరిగి ఉండవచ్చని అవినాష్ రెడ్డి ఆరోపించడంతో వైఎస్ వివేకా పరువును తీసేసినట్లయింది. ఇన్నాళ్లూ తాము బయటకు చెప్పలేక పోవడానికి కారణం కుటుంబం పరువు పోతుందనేనని కూడా అవినాష్ రెడ్డి చెప్పడం గమనార్హం ఇక తాజాగా మరో లైంగిక సంబంధమైన ఆరోపణ కూడా వెలుగులోకి వచ్చింది. ఈకేసులో ప్రధాన నిందితుడు సునీల్ యాదవ్ తల్లిని వివేకానందరెడ్డి లైంగిక వేధింపులకు గురిచేశాడని అందువల్లనే సునీల్ యాదవ్ చంపాడని వైఎస్ భాస్కర్ రెడ్డి న్యాయవాది కోర్టుకు తెలపడంతో మరో సంచలనానికి దారి తీసింది. అయితే వైఎస్ వివేకా హత్య కేసులో ఇలాంటి ఆరోపణలు వినిపించడం వైఎస్ కుటుంబానికి తలవంపులు తెచ్చేవే. అయితే తమనే నిందితులుగా మార్చాలన్న ప్రయత్నాలు జరుగుతుండటంతోనే ఆరోపణలు బయటపెడుతున్నామంటున్నారు. కానీ 67 ఏళ్ల వయసులో పెద్దాయనపై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. . చనిపోయిన వారిపై ఇంత నిర్దాక్షిణ్యంగా ఆరోపణలు చేస్తారా? ఆయన క్యారెక్టర్ దెబ్బతీసేలా వ్యవహరిస్తారా? అంటూ వైఎస్ వివేకా కుమార్తె కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద వివేకా హత్య కేసులో అసలు కారణాలు ఏవన్నది సీబీఐ ఇంతవరకూ తేల్చకపోయినా ఆ కుటుంబంపై మాత్రం అక్రమ సంబంధాల ఆరోపణలు రావడం వైఎస్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏదైనా అది కుటుంబ వ్యవహారం కావడంతో బయటపడటం లేదు కానీ.. కసిగా హత్య చేయడానికి రాజకీయ కారణాలకంటే.. వ్యక్తి గత కారణాలే ఎక్కువన్నది మాత్రం నిజమని అంటున్నారు. మరి ఏది నిజం..? ఏది అసత్యం..? తేల్చాల్సింది ఇక సీబీఐనే.

# కోల్డ్ బ్లడెడ్ మర్డర్లు...

**విజయవాడ :**

పగలు రెక్కీ.. రాత్రిమర్డర్.. కత్తిపోటు పడదు.. నెత్తురు చుక్క కానరాదు.. గాయాలుండవు.. మర్డర్ అనే అనుమానం అసలే రాదు.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు హత్యలు, 20 కి పైగా నేరాలు.. ఐదుగురు ఐదుగురు సభ్యులు.. మొత్తం 22 ఏళ్ళ లోపు వారే.. బంగారం, డబ్బు కోసం జరిగిన ఈ కిరాతక హత్యల్లో ఎట్టకేలకు నిందితులకు జీవిత ఖైదు పడింది.చెడు వ్యసనాలకు బానిసై బంగారం, డబ్బు సంపాదించాలనే వ్యామోహంతో వీరు చేసిన దారుణాలు ఏడాది క్రితం బెజవాడని ఉలిక్కి పడేలా చేసాయి. పోరంకి ప్రాంతానికి చెందిన 22 ఏళ్ళ సుంకర గోపిరాజు, ప్రభు కుమార్లు స్నేహితులు ఆటో నడుపు తుంటారు. చెడు వ్యసనాలకు బానిసై కష్టపడకుండా సులువుగా డబ్బు సంపాదించు కోవాలనుకున్న వీరు నేరాలు, హత్యలు, దోపిడిలు చెయ్యటం ప్రారంబించారు. ఎక్కడా ఆధారాలు దొరకకుండా ఎలాంటి అనుమానాలు రాకుండా ఏడాది క్రితం ఒంటరి వృద్ధ మహిళలను అతి కిరాతకంగా హత్య చేసారు. వీరి యాక్షన్ టీమ్‌లో చక్రి, దుర్గారావు, ఫణింద్ర అనే మరో ముగ్గురు కూడా ఉన్నారు. ఒంటరిగా ఉండే వృద్ధ మహిళలే వీరి టార్గెట్. గోపి ఆటోలో కూరగాయలు అమ్ముతూ పగలు రెక్కీ నిర్వహించేవాడు. ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను గుర్తించి రాత్రికి స్పాట్ పెట్టేవారు. ఈ ఐదుగురు కలిసి రాత్రికి ఫినిష్ చెసేశారు. దండుపాళ్యం గ్యాంగ్ తరహాలో ఏర్పడ్డ ఈ ముఠా తొలినేరం పెనమలూరు లో చేసారు. అప్పటికే ఐదు నేరాలు చేసి, ఆరుగురిని హతమార్చారు. అయినా ఒక్క కేసు బయటకు రాలేదు. అది హత్య అని కూడా ఎవ్వరికీ తెలియలేదు. అదే వీరి స్పెషలిటీ.వంద గొడ్ల తిన్న రాబందు కూడా ఒక్క గాలి వానాకే



నేలకూలిందన్నట్లుగా ఓ చోరీలో వీరంతా అడ్డంగా దొరికిపోయారు. దాంతో వీరి వ్యవహారం మొత్తం బయటపడింది. గతేడాది పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎంలో దొంగతనం చేసేందుకు యత్నించిన కేసులో సీసీ పుటేజి ద్వారా దర్యాప్తు చేసిన పోలీసులకు ఈ నేరాలు, హత్యలు వెలుగులోకి వచ్చాయి. వీరి వ్యూహాలు, ప్లాన్ల ను తెలుసుకున్న పోలీసులు కూడా షాక్ కు గురయ్యారు. కరోనా సమయం కావటంతో వృద్ధ మహిళలు చనిపోతే అనుమానం రాదని సాధారణ మరణంగా భావిస్తారని పక్కా ప్లాన్‌తో రెక్కీ నిర్వహించి ఇళ్లకు వెళ్లడం, ముందుగా ఆ ఇంట్లో ఉన్న వారిని దుప్పటితోనో లేక దిండుతోనో అదిమిపట్టి ఊపిరి ఆడకుండా చంపి వారి శరీరంపై ఉన్న బంగారం, ఇంట్లో దొరికిన నగదుతో భాధిత కుటుంబాలకు ఎలాంటి డౌట్ రాకుండా తప్పించుకునే వారు. ఇక చనిపోయిన వారు వయస్సులో పెద్ద వారు కావటంతో బంధువులు సైతం సహాజ మరణంగా బావించి అంత్యక్రియలు చేయడంతో ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కానీ ఒక్క చోరీ కేసులో దొరికిపోయి ఆఖరికి కటకటాల పాలయ్యారు. దాంతో అప్పటికే విరు రెక్కీ నిర్వహించి స్కెచ్‌కు సిద్ధంగా ఉన్న కంకిపాడు, ఉయ్యురు, పెనమలూరు, తెనాలి, మంగళగిరిలో ప్లాన్ ఫెయిల్ అయ్యి, మరిన్ని హత్యలకు బ్రేక్ పడింది.

# హరీష్ రావు కు రీసౌండ్ ఇచ్చేలా కౌంటర్లు

**ఏలూరు :**

ఏపీని ఉద్దేశిస్తూ మంత్రి హరీశ్ రావ్ వ్యాఖ్యలతో పొలిటికల్ హీట్ మొదలైంది. దీనిపై రియాక్ట్ అవుతున్న వైసీపీ నేతలు....తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏపీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ.... ధనిక రాష్ట్రాన్ని మీ చేతిలో పెడితే ఏం చేశారో తెలియదా..? అంటూ ప్రశ్నించారు. ఏపీకి వస్తే ఏం జరుగుతుందో కనిపిస్తుందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో వర్షం వస్తే ఇళ్ల మీద నుంచి నీళ్లు వెళ్తున్నాయంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు తేడా చూడాలంటూ హితవు పలికారు. హరీశ్ రావ్ గారూ.. ముందు మీ రాష్ట్రం(తెలంగాణ) సంగతి చూసుకో అంటూ కామెంట్స్ చేశారు.ఇక మంత్రి హరీశ్ రావ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీదిరి అప్పలరాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు బీఆర్ఎస్ అనేదే ప్రాంతీయ ఉన్మాదం మీద పుట్టిన పార్టీ అంటూ మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా టీఆర్ఎస్ ఏర్పాటైందన్నారు. హైదరాబాద్ లోని పెట్టుబడులన్నీ ఆంధ్రావాళ్లవే అని చెప్పారు. ఆ పెట్టుబడులతోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. ఏపీ ప్రయోజనాల విషయంలో ఏ రోజు కూడా బీఆర్ఎస్ ఒప్పుకోలేదని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అనేది మా హక్కు అని చెప్పారు. బీఆర్ఎస్ పెట్టి స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడితే జాతీయ పార్టీ అయిపోతుందా..? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ అనేది కుటుంబ పాలన చేయటానికి తెలంగాణ కాదు అంటూ ఘాటుగా మాట్లాడారు. ఏపీకి చెందినవారు తెలంగాణలో ఓట్లు తీసుకోవాలంటూ హరీశ్ రావ్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మొదలైంది. సంగారెడ్డిలో మంగళవారం మేస్త్రీ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీని ఉద్దేశిస్తూ కొని వ్యాఖ్యలు చేశారు. అక్కడికి...ఇక్కడికి జమీన్ ఆస్మాన్ ఫరక్ ఉందని చెప్పారు. అందుకే ఏపీలో ఓటు రద్దు చేసుకుని తెలంగాణలో నమోదు చేసుకోవాలని వారికి సూచించారు. దీంతో ఏపీ వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే దీనిపై ఇవాళ మరోసారి స్పందించారు హరీశ్ రావ్.ఏమన్నానని ఆంధ్రా మంత్రులు ఎగిరెగిరి మాట్లాడుతున్నారని నిలదీశారు. తమ దగ్గర కాళేశ్వరం ప్రాజెక్ట్ ఉందని... 56 లక్షల ఎకరాల సాగు భూమి ఉందని చెప్పారు. రైతు బీమా, రైతు బంధు ఉందంటూ మంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు. తమ దగ్గర ఇవన్నీ ఉన్నాయంని...మీ దగ్గర ఏమున్నాయంటూ ఏపీ మంత్రులను ఎదురు ప్రశ్నించారు. "నా వ్యాఖ్యలపై స్పందించిన ఓ ఏపీ మంత్రి అంటుండు.. మీ తెలంగాణలో ఏం ఉందని ప్రశ్నించాడు. మా దగ్గర 56 లక్షల ఎకరాల యాసంగి పంట ఉంది మంత్రి గారు. ఆడపిల్లకు కల్యాణ లక్ష్మీ ఇస్తున్నాం. మా దగ్గర కేసీఆర్ కిట్ ఉంది మంత్రి గారు. ఎకరానికి పది వేలు ఇచ్చే రైతుబంధు ఉంది మంత్రి గారు. ఐదు లక్షలు ఇచ్చే రైతుబీమా కూడా ఉంది. 26 మెడికల్ కాలేజీలు కూడా ఏర్పాటు చేశాం. ప్రపంచమే అబ్బురంపడేలా కాళేశ్వరం ప్రాజెక్ట్ ను మూడేళ్లలోనే పూర్తి చేశాం మంత్రిగారూ. మీ దగ్గర ఏం ఉంది మంత్రిగారూ..? విశాఖ ఉక్కుపై మాట్లాడరు. ప్రత్యేక హోదా కేంద్రం ఎగబెట్టిన ఏం అడగరు. విశాఖ ఉక్కును తుక్కుకి అమ్మిన ఎవ్వరు అడగరు. ప్రతిపక్షంలో ఉన్నవాళ్లు ప్రశ్నించరు. ప్రజలను గాలికి వదిలేశారు.. మీ ప్రయోజనాలు చూసుకుంటున్నారు. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ కలిసి ఏపీని ఆగం చేశాయి. అలాంటి మీరు మా జోలికి రాకండి. మా గురించి మాట్లాడకపతే అది మీకే మంచింది" అంటూ ఘాటుగా బదులిచ్చారు హరీశ్ రావ్ తాజాగా హరీశ్ రావ్ కాస్త గట్టిగా బదులివ్వటంతో? ఏపీ మంత్రులు, వైసీపీ నేతలు రీసౌండ్ పెంచారు. అసలు తెలంగాణలో ఏం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు.

# వేసవిలో "ఎస్పీఎఫ్" సేవలు అభినందనీయం..

**కాకినాడ**

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎస్పీఎఫ్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పోర్ట్ అధికారి ధర్మశాస్త్ర పేర్కొన్నారు. కాకినాడ ఎంకరేజ్ పోర్ట్ లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళ విభాగం (ఎస్పీఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోర్ట్ అధికారి ధర్మశాస్త్ర, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీనివాస రావు హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్ట్ అధికారి ధర్మశాస్త్ర మాట్లాడుతూ... గత ఆరు సంవత్సరాలుగా ఎంకరేజ్ పోర్ట్ లో ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారని, పోర్ట్ లో పని చేస్తున్న వివిధ సంస్థలు,ట్రేడ్ యూనియన్లు సహకారంతో ఎస్పీఎఫ్ సిబ్బంది చలివేంద్రాన్ని వేసవిలో మూడు నెలల పాటు కొనసాగిస్తారని ప్రజలకు, పోర్ట్ లో పనిచేస్తున్న కార్మికులకు ఎండ వేడిమి కి గురికాకుండా ఉండేందుకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ సిఐ జి.శ్రీధర్, ఎస్సై కె. కృష్ణరావు, ఏఎస్ఐ పుల్లయ్య,ఎస్పీఎఫ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కు ఆంధ్రాలో చోటిస్తారా...

**ఒంగోలు:**

టీఆర్ఎస్ బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెంది.. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్దమవుతోంది. అయితే కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ను ఆంధ్ర ప్రజలు ఓన్ చేసుకొంటారా? అన్న సందేహాలు రాజకీయవర్గాల్లో వ్యక్తమ ాతున్నాయి.2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగింది. నాటి నుంచి నేటి వరకూ అంటే ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఏపీ స్థిరంగా కుదురుకున్న దాఖలు లేవు. ఏపీ ఇంకా సమస్యల సుడిగుండంలో చిక్కకొని అల్లాడిపోతోంది. అలాగే విభజన సమయంలో ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు సైతం గల్లంతు అయ్యాయని వారు గుర్తు చేస్తున్నారు. విభజన బిల్లు.. ఆమోదం పొందే సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా 5, 10, 15 ఏళ్లు అంటూ.. బహిరంగ వేలం జరుగుతోన్న వేళ నాయకులు గొంతు సవరించు కునేలోగానే బిల్లు పాస్ అయిపోయిందని.. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హోదా లేదు.. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాలేదు. మహాభారతంలో భీముడు.. జరాసంధుడ్ని సునాయాశంగా చీల్చినట్లు.. విభజనతో రాష్ట్రాన్ని చీల్చారు. విభజనతో అన్ని విధాలుగా నష్టపోయినా ఏపీకి ఇంత వరకు న్యాయం జరగలేదు. మరో వైపు విభజన నేపథ్యంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సి ఉమ్మడి ఆస్తుల పంపకం ఈ రోజుకూ తేల లేదు. నదీ జాలాల్లో నీటి వాటా కోసం.. ఈ రెండు రాష్ట్రాల పేచీ నేటికీ జలసౌధ సాక్షిగా కొన.. సాగుతోనే ఉందని వారు వివరిస్తున్నారు. అలాగే ఆంధ్రా, తెలంగాణ ఉద్యోగులు పంచాయతీ ఇంకా నడుస్తూనే ఉంది. ఆంధ్ర ప్రదేశ్‌కు ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా అయితేనేమీ.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలంటూ ఈ గులాబీ దళం ఏనాడు.. కేంద్రంపై ఒత్తిడి తీసుకు వచ్చిన పాపాన పోలేదన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇంకా సోదాహరణగా వివరించాలంటే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే.. మా తెలంగాణకీ ఇవ్వాలి.. పోలవరంకు జాతీయ హోదా ఇస్తే.. మా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలంటూ కేసీఆర్ ఫ్యామిలీ ప్లస్ ఆయన కేబినెట్‌లోని మంత్రులు సైతం పలు సందర్భాల్లో పార్లమెంట్ సాక్షిగా డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే.. తెలంగాణలో ఉన్న పరిశ్రమలు ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలన్నీ మూటా ముల్లు సర్దుకొని ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతాయంటూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు.. గతంలో ఎన్నిక ప్రచారం వేళ.. చేసిన వ్యాఖ్యల వీడియోలు నేటికి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మరోవైపు విశాఖ ఉక్కు పరిశ్రమ.. ప్రైవేటీకరణ దిశగా మోదీ ప్రభుత్వం వేసిన అడుగు పూర్తి కావోస్తున్నాయి. అలాంటి వేళ దీనిని కొనుగోలు చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం బిడ్ వేస్తోందనే ఓ టాక్ అయితే అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వంలో ఆంధ్రా ఉద్యోగులు ఒక్కరు కూడా ఉండకూడదంటూ.. హుకూం జారీ చేసిన కారు పార్టీ అధినేత.. నేడు.. ఆంధ్రప్రదేశ్‌కు ఎలా వస్తారని... ఓ వేళ వస్తే.. ఆయన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆదరిస్తారా అంటే సందేహమే అని పరిశీలకులు అంటున్నారు.అదీకాక గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 23 జిల్లాలతో నిత్య కల్యాణం పచ్చ తోరణంలాగా నిత్యం కళకళలాడుతూ ఉండేదని... ఇంకా క్లియర్ కట్‌గా చెప్పాలంటే.... దేశంలోని మొత్తం రాష్ట్రాల జాబితాలో... అక్షర క్రమంలోనే కాదు... అభివృద్ధిలోనే కాదు... ఆర్దికాభివృద్ధిలో సైతం ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండేదని... కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత.. అంటే 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత.. విభజిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలి పోయిన తర్వాత.. ఆంధ్రప్రదేశ్ అక్షర క్రమంలో అగ్రస్థానంలోనే ఉన్నా.. అభివృద్ధిలో... ఆర్థికాభివృద్ధిలో మాత్రం అట్టడుగు స్థానానికి సర్రున జారిపోయిందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో... ఉన్న కళను పొగొట్టి.. మళ్లీ పాత కళ తీసుకు వస్తామని పక్క రాష్ట్రం వారు ఎవరో వచ్చి చెబితే.. ఆంధ్రోళ్లు ఆదరిస్తారా? అంటే.. ఏమో... ఎన్నికల వేళ వరకు వేచి చూడాల్సిందేననే ఓ అభిప్రాయం అయితే రాజకీయ విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతోంది.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## జడ్పీ చైర్మన్, ఎంపిపిల ఘర్షణ

**నిజామాబాద్**



నిజామాబాద్ జిల్లా మాక్లూర్ బాలల సంరక్షణ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. జిల్లా పరిషత్ చైర్మన్ విట్టల్ రావు, ఎంపిపి మాస్త ప్రభాకర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గురువారం జరిగిన సమావేశానికి ఎంపిపి ఆలస్యంగా రావడంతో గొడవ చెలరేగింది. ఎంపి ఆలస్యం రావడంపై జడ్పీ ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. నువ్వేంత అంటే నువ్వేంత అంటూ ఇరువురు తిట్టుకున్నారు. అధికారుల ముందే జెడ్పి చైర్మన్, ఎంపిపి తిట్టుకున్నారు. ఇద్దరు బిఆరెస్ నేతలే కావటంతో మిగతా సభ్యులు అవక్కాయ్యారు.

## అనంత రేంజ్ డిఐజీగా అమ్మిరెడ్డి

**అనంతపురం**



అనంతపురం రేంజ్ డి ఐ జీ గా ఆర్ ఎన్ ఆమ్మిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తరువాత అయన మీడియాతో మాట్లాడారు. అనంతపురం రేంజ్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ నేరగాళ్ల పై ప్రత్యేక నిఘా వుంచుతామని అన్నారు. తిరుపతి, చిత్తూరు, అనంత పురం,సత్యసాయి జిల్లాల ల్లో విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాదాన్యతఇస్తాం. పోలీసు శాఖలో ప్రెండ్లీ పోలీసింగ్ విధానం మరింత పటిష్టంగా అమలు చేసేలా చూస్తా. తిరుమల పుణ్య క్షేత్రం పవిత్రత కాపాడటం లో పోలీసు విభాగం కీలకంగా వ్యవహరిస్తుంది. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరి రక్షణలో రాజీలేని విధులు నిర్వర్తించే లా చూస్తానని అన్నారు.

## గోడ కూలి చిన్నారి మృతి

**యాదాద్రి భువనగిరి**

భువనగిరి మున్సిపల్ డంపింగ్ యార్డు లో దారుణం జరిగింది. మున్సిపల్ ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా గోడను డీ కొట్టింది. ట్రాక్టర్ డీ కొట్టడం తో గోడ కూలింది. ప్రమాద సమయంలో ఇద్దరు అస్సాం కూలీల చిన్నారులు అక్కడే వున్నారు. చిన్నారి అప్సాన(10), అక్కడికక్కడే మృతి చెందింది. మణుర్ మర్యా (3) సంవత్సరాలు కు గాయాలు అయ్యాయి.

## గోడ కూలి చిన్నారి మృతి

**యాదాద్రి భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. చెత్త తరలినీచే ఓ మినీ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యానికి చిన్నారి బలైపోగా.. మరో చిన్నారి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. భువనగిరి మున్సిపల్ డంపింగ్ యార్డ్ లో ఈ ఘటన జరిగింది. వ్యాన్ రివర్స్ వెళ్ళే క్రమంలో గోడను ఢీకొంది. దాంతో గోడ కూలి పోయింది. అక్కడే ఆడుకుంటున్న పదేళ్ల చిన్నారి స్పాట్ లోనే మృతి చెందగా, మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. బాధిత చిన్నారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడం జరిగింది. బాధిత చిన్నారులు అస్సాం నుంచి వచ్చిన వలస కూలీల పిల్లలుగా తెలుస్తుంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మినీ వ్యాన్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు.

## ఎమ్మెల్యే రవీంద్ర నాయక్ కేడర్ తిరుగుబాటు

**నల్గొండ**

నల్గొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర నాయక్ పై అధికారపార్టీ శ్రేణులు తిరుగుబాటు చేసాయి. గురువారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి శాసన మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వర్గం దుమ్మా కొట్టింది. గుత్తా ప్రధాన అనుచరుడు వడ్యా దేవేందర్ నాయక్ తో పాటు దేవరకొండ మున్సిపల్ ఛైర్మెన్ అల్లంపల్లి నరసింహ,ఎంపీపీ నల్ల దాసు జాన్ యాదవ్, మాజీ మార్కెట్ ఛైర్మన్ సిరందాస్ లక్ష్మమ్మ,పలువురు నేతలు గైర్హాజరయ్యారు.ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ పలువురు బీఅరెస్ నేతలు. కార్యక్రమానికి డుమ్మా కొట్టి యాదగిరిగుట్టకు వెళ్లినట్లు సమాచారం. ఇటీవల సైతం సదరునేతలు ఓ కార్యక్రమానికి డుమ్మా కొట్టి తిరుపతి చెక్కేసిన విషయం తెలిసిందే.

## రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**హైదరాబాద్**

శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభమించనున్న 125 అడుగుల భారీ అంబెడ్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా దేశ నలుమూలల నుండే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అంబెద్కర్ వాదులు తరలివస్తున్నారని స్థానిక ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. హైదరాబాద్ ఖైరతాబాద్ నియోజక వర్గంలోని బ్యాండ్ లైన్ మరియు, షేర్ గెట్ లోని దాదాపు 500వందల మంది నిరుపేదలకు రంజాన్ తోఫా కిట్లను ఎమ్మెల్యే దానం,కార్యకర్తలతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశంలో ఎక్కడా లేని విధంగా భారత రాజ్యాంగం నిర్మాత బాబా సాహెబ్ అంబెడ్కర్ యొక్క అతిపెద్ద విగ్రహం నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దక్కుతుంది అని అన్నారు.తన నియోజకవర్గంలో ఇలాంటి చరిత్రక కట్టడం రావడం నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. నూతన సచివా లయానికి అంబెడ్కర్ పెరుపెట్టడం,అమరుల త్యాగాన్ని గుర్తించి స్మారకస్తూపం నిర్మించడం చరిత్రాత్మక విషయమని తెలిపారు.

# నాపై దేవినేని విమర్శలు చేయడం హాస్యాస్పదం

## మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు

**మైలవరం,**

పిల్లికి ఎలుక సాక్ష్యంలా పచ్చపత్రికను అడ్డం పెట్టుకుని నువ్వు ఎన్ని అవాకులు చవాకులు పేలినా నమ్మేవారు ఎవరూ లేరు దేవినేని ఉమామహేశ్వరరావని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అన్నారు. కొండపల్లి అడవిలో ఏం జరిగిందో ప్రజలందరికీ, ముఖ్యంగా టీడీపీ వాళ్లందరికీ తెలుసు. ఎవరు అక్రమంగా మైనింగ్ చేస్తే వాళ్ళను పట్టుకుంటారు.వెలగలేరు, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద గ్రామాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందని నేను కలెక్టర్ కు స్వయానా లేఖ రాశాను. నేను లెటర్ పెట్టిన తర్వాత దేవినేని ఉమా అక్కడకు వెళ్లి పరిశీలించి, హడావుడి చేశాడని అయన ఆరోపించారు.

నాకు వస్తున్న మంచిపేరు చూసి తట్టుకోలేక పాతకథలే మళ్ళీ చెప్పుకుంటూ మళ్ళీ మీడియా ఎదుట దేవినేని ఉమా తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. విజిలెన్స్ అధికారుల నివేదికల ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అక్కడ ఎంత పెనాల్టీ వేయాలో విధాన నిర్ణయం ప్రకారం చర్యలు ఉంటాయి. నువ్వెవడివి పదిరెట్లు పెనాల్టీ వేయాలని చెప్పడానికి. నువ్వు చేసిన అక్రమాలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వాళ్ళు 100 కోట్ల రూపాయలు పెనాల్టీ వేశారు. ముందు నువ్వు ఆ సొమ్ము కట్టు. పద్ధతి, సంస్కారంతో మాట్లాడితే నేను అదే రీతిగా తిరిగి సమాధానం చెప్తాను. నీ అతి తెలివితేటలు, పిచ్చి మాటలు, వెకిలి చేష్టలు ఇకనైనా కట్టిపెట్టని అన్నారు.స్టిక్కర్లు అంటిస్తాంమా ఇష్టం. మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికి చెప్పుకుంటూ తిరుగుతున్నాం. నాలుగు సార్లు శాసనసభ్యుడిగా, ఒక పర్యాయం మంత్రిగా ఉండి, ఏనాడైనా సరే నీకు ఓట్లు వేసిన ప్రజల గుమ్మం నువ్వు తొక్కావా? నీకు దమ్ముంటే, నీకు చేతనైతే మీ పార్టీ మేనిఫెస్టో కూడా ప్రింట్ చేసి, నేరుగా ప్రజల వద్దకు వెళ్లి, మీరు ఇచ్చిన 600 హామీల్లో ఏమైనా అమలు చేసి ఉంటే చెప్పుకోమని సూచించారు.

మేము పథకాలు అమలు చేసాం కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నాం. మా నాయకుడి స్టికర్ని మేము అంటించుకుంటున్నాం. మేము ఏ కార్యక్రమం చేసుకుంటే నీకెందుకురా. నాయనా..! నువ్వేమో ఎక్కువ, తక్కువగా మాట్లాడుతుంటావు, మళ్లీ నేను నిన్ను ఏదైనా అంటే నీలుగుతుంటావ్...! నిన్ను ఎప్పుడో జనాభా లెక్కల నుంచి తొలగించేశాము.నేను నిరంతరం ప్రజల్లో ఉంటే దేవినేని ఉమాకు ఈర్ష, ద్వేషం, అసూయ. తనకు ప్రజల్లో వస్తున్న మంచి పేరు చూసి తట్టుకోలేక ఇటువంటి బురదజల్లే కార్యక్రమాలు ఉమా చేస్తుంటాడని మండిపడ్డారు.

ఇటువంటి అవకాశ వాదులకు 2019 తరహాలోనే 2024 ఎన్నికల్లో కూడా బుద్ధి చెప్పాలని మైలవరం శాసనసభ్యులు ప్రజలకు పిలుపునిచ్చారు.

## ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కంటు స్టిక్కర్లు అంటించాలి

**కాకినాడ:**

దేశ, రాష్ట్రంలో పాలిస్తున్న బిజెపి, వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు గురువారం సుందరయ్య భవన్లో ప్రచార భేరి పోస్టర్లను వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, సిపిఎం జిల్లాకన్వీనర్ ఎం రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయని, బిజెపి కార్పొరేట్ మతోన్మాదం విధానాలను ప్రజలలో ఎండగట్టాలని దేశాన్ని మొత్తం ఆదాని వారికి అప్పజెప్పడానికి నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు అదానీ గ్రూపు వారికే దారాదత్త చేయడం చూస్తున్నామని, మరోవైపు అధిక ధరలు, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బిజెపి ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇవ్వకుండా దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగేలా చేసిందన్నారు. ప్రైవేటీకరణ, జీఎస్టీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఒకవైపున మతోన్మాదం పేరుతో హింసను పెంచుతున్నారన్నారు.




మతమార్పిడులు మైనార్టీలపైనా, దళితులపై దాడులు అధికమయ్యాయని మధు, రాజశేఖర్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ప్రజలలో ఎండగట్టాలని, పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక హోదా ఇస్తామని విభజన హామీలను అమలు చేస్తామని చెప్పినా ఇంతవరకు అమలు చేయలేదని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ ఆపాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని, రాజధాని నిర్మాణం జరగాలని, వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలిస్తున్న సీఎం జగన్ ప్రజల కష్టనష్టాలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ పోతూ ఆర్థిక ఇబ్బందులకు పాలు చేస్తున్నారని రాష్ట్రంలో భూ, ఇసుక, లిక్కర్ మాఫియా కొనసాగుతున్నదని, ఉద్యమాల నిర్వహించడానికి కూడా వీలు లేకుండా జీవో నెంబర్ ఒకటి తీసుకువచ్చి రాష్ట్రంలో ప్రశ్నించే వాడే ఉండకూడదనే విధంగా జగన్ ప్రభుత్వం ప్రయత్నం చేయడం దుర్మార్గమని తెలిపారు. వీటన్నిటిపై ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న నోరు మెదపలేదని రాజశేఖర్, మధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సిపిఎం సీనియర్ నాయకులు దువ్వ శేషుబాబ్జి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ పార్టీకి ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజీనామా

**హైదరాబాద్ :**

తెలంగాణకు కాంగ్రెస్‌కు ఈ మధ్య షాకుల మీద షాకులు తగులుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీకి ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజీనామా చేశారు. నేటి ఉదయమే ఢిల్లీకి చేరుకున్న మహేశ్వర్ రెడ్డి ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు యత్నిస్తున్నారంటూ తొలుత వార్తలొచ్చాయి. ఇంతలోనే పార్టీకి ఖర్గే తన రాజీనామా లేఖను పంపించేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని రోజులుగా మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్య క్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. నిన్న క్రమశిక్షణ కమిటీ ఆయనకు షో కాజ్ నోటీస్ జారీ చేయడంతో మహేశ్వర్ రెడ్డి మనస్తాపానికి గురైనట్టు తెలుస్తోంది.

"కాంగ్రెస్ పార్టీలో 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా.. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా వివిధ హోదాల్లో ఎన్నో ఆటంకాలను, అవరోధాలను



ఎదుర్కొని పని చేశాను. ఎలాంటి ఆరోపణల్లేని మచ్చలేని చరిత్ర ఉన్న నేను.. ఏనాడూ పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తించలేదు.అయితే కాంగ్రెస్‌లో గత కొన్ని నెలలుగా జరుగు?తన్న రాజకీయ పరిణామాలను చూసి పార్టీలో నేను ఇమడలేనని అర్థమైంది. అందుకే కాంగ్రెస్‌లో ఇక ఎంత మాత్రం కొనసాగలేనని భావించి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా" అని మహేశ్వర్‌రెడ్డి రాజీనామా లేఖలో పేర్కొన్నారు.ఇక నిన్న ఆయన తనకు షోకాజ్ నోటీస్ జారీ చేయడంపై మీడియాతో మాట్లా డుతూ.. "ఏ రోజు నేను పార్టీ గీత దాటలేదు. అంతర్గత సమావేశాల్లో మాత్రమే నేను మాట్లాడినా. రేవంత్ వెలుమ కమ్యూనిటీ మీద మాట్లాడినప్పుడు మాత్రమే నేను మాట్లాడలేదు. ఇప్పటికీ రేవంత్ రెడ్డి అంటే నాకు అభిమానం. సీనియర్ల మీటింగ్ నా ఇంట్లో ఉంటే దిగ్విజయ్ కోరిక మేరకు వాయిదా వేశాం. జనరల్ సెక్రటరీని మార్చమని మేము ఎప్పుడూ కోరలేదు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటా. షోకాజ్ ఇవ్వడం బాధాకరం. ఖర్గేను కలిసి నిర్ణయం తీసుకుంటా. నేను పార్టీ మారాలంటే బాజాప్త రాజీనామ చేసి వెళతా. నేను పార్టీ మారాలని ఏ రోజు అనుకోలేదు. నా సమావేశాలకు బీజేపీ నేత అటెండ్ అయ్యారనే ది పచ్చి అబద్ధం. అమిత్ షా ను బీజేపీ పెద్దలను కలిసేవారికి షోకాజ్ ఇచ్చే ధైర్యం లేదు. కానీ నాకు ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదు" అని పేర్కొన్నారు.

## స్కాముల్లో జగన్ రెడ్డి ఆరితేరిపో యారు- మాజీ మంత్రి బండారు

**విశాఖపట్నం**

స్కాముల్లో జగన్ రెడ్డి ఆరితేరిపోయారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు.విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ... ఫిల్మ్ అవసరాల కోసం విశాఖలో రామానాయుడు స్టూడియోకి ఎకరా 20 లక్షల చొప్పున 54 ఎకరాలు టీడీపీ హయాంలో ఇచ్చామని,రాజశేఖర రెడ్డి హయాంలో అడ్డుకోవాలని చూసారని,కాని అది జరగలేదని అన్నారు.అయితే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి రామానాయుడు స్టూడియో స్థలంపై కన్ను పడిందని,ఇపుడు 17 ఎకరాలు జీవీఎంసీ కమిషనర్ కి పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. స్టూడియో ప్రమోషన్ కిచ్చిన స్థలాన్ని లే అవుట్ ఎలా ఇస్తారని,రెండేళ్లుగా ప్రయత్నించి ఈనెల 10న రిజిస్ట్రేషన్ జరిపించారని చెప్పారు.ఈ వ్యవహారం పై టీడీపీ న్యాయ పోరాటం చేస్తుందని,బెదిరించి విశాఖలో విలువైన స్థలాలు లాక్కుంటారని ఆరోపించారు.

## జర్నలిస్టు ఆత్మహత్య

**పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంకు చెందిన జర్నలిస్ట్ పొన్నం శ్రీకాంత్ పెద్దపల్లి అందర్ రైల్వే బ్రిడ్జి వద్ద ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా ఒక దినపత్రికలో పని చేస్తున్న శ్రీకాంత్ జర్నలిజం వృత్తిలో కొందరు వ్యక్తులు అడ్డు తగులుతున్నారని మానసిక ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. తన చావుకు కారణం రామగిరి మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు అని సామాజిక మాధ్యమాల లో పోస్ట్ చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనలో శ్రీకాంత్ శరీరం ముక్కలు ముక్కలుగా పడిపోయాయి.

## రేణుకా చౌదరీని అడ్డుకున్న పోలీసులు

**ఖమ్మం**

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడు లో జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా బాణాసంచా వలన గ్యాస్ పేలిన ఘటన లో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. మరణించిన కుటుంబాలను పరామర్శించేందుకు వెళు న్న కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుక చౌదరిని పోలీసులు అడ్డుకున్ఆనరు. దాంతో ఆమె పోలీసులతో రేణుక వాగ్వాదానికి దిగారు. కామేపల్లి పోలీస్ స్టేషన్ దగ్గర ఈ అడ్డగింత జరగడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు పలువురు అందోళనకు దిగారు. దీంతో ఖమ్మం ఇల్లందు ప్రధాన రహదారిపై వాహన రాకపోకలు ఆగిపోయాయి.

## ఏప్రిల్ 14 నుండి అగ్నిమాపక వారోత్సవాలు

**హైదరాబాద్**

రాష్ట్రంలో శుక్రవారం నుచం అగ్నిమాపక వారోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నాడు వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పలువురు అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గోన్నారు. ఈ వారోత్సవాలలో అగ్నిప్రమాదాల నివారణ పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు

## విశాఖ చేరుకున్న కేంద్ర ఉక్కు సహాయ మంత్రి

**విశాఖపట్నం**

కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ గురువారం విశాఖలో పలు కార్యక్రమాలకు పాల్గొన్నందుకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. ఉక్కు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. విశాఖ చేరుకున్న ఆయనకు బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. విశాఖ విమానాశ్రయం నుండి నేరుగా క్లాసిక్ ఆఫీసర్స్ అతిథి గృహానికి అయన బయలుదేరారు.

## స్వామికి బంగారు కిరీటాలు బహూకరణ

**యాదాద్రి**



యాదాద్రి నరసింహుడికి ఒక భక్తుడు బంగారు కిరీటాలు బహుకరించాడు. హైదరాబాద్ లోని చంపాపేట్ కు చెందిన మాచమోని టీవీప్రకాష్ ముదిరాజ్ సుమారు రూ. 30 లక్షల విలువచేసే అరకేజీ బంగారం, అరకేజీ వెండితో మూడు కిరీటాలు, ప్లేట్లు స్వామి వారికి బహూకరించారు. ఇందుకు సంబంధించిన కిరీటాలను ఆలయ ఈవో గీతకు అందజేశారు.

## దళితులపై పెరుగుతున్న దాడులు

**విశాఖపట్నం**

కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విశాఖ నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి ఆర్ఎస్ఎస్ పార్టీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బిజెపి ఆర్ఎస్ఎస్ అవలంబిస్తున్న కుల వివక్ష ప్రదర్శనను వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకుడు రాజు మాట్లాడుతూ బిజెపి ఆర్ఎస్ఎస్ పార్టీలు దళితుల పక్షాన ఉన్నట్లు కబుర్లు మాత్రమే చెప్తున్నారు అని, నిజానికి ఎస్సీ ఎస్టీ నిధులు సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. వీటిని అరికట్టకపోతే రానున్న రోజుల్లో కుల వివక్ష పోరాట సంఘం తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరించారు.

## బీజేపీ 'నిరుద్యోగ మార్చ్'కు పోలీసుల అనుమతి

**వరంగల్**

ఈనెల 15న హన్మకొండ కాకతీయ యూనివర్శిటీ చౌరస్తా నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న 'నిరుద్యోగ మార్చ్ కు వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం అనుమతినిచ్చింది. దాంతో ఓరుగల్లు నిరుద్యోగ మార్చ్ విజయవంతం కోసం బీజేపీ నేతల వరుస సమావేశాలు ఏర్పాటు చేసారు. కాకతీయ యూనివర్శిటీతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల్లో నిరుద్యోగ మార్చ్ కు తరలిరావాలంటూ కరపత్రాలు పంపిణీ చేసారు. బీజేపీ కళా బృందాలు పాటలు పాడుతూ నిరుద్యోగ మార్చ్ కు అహ్వానిస్తున్నాయి. ?ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరుద్యోగ మార్చ్ పోస్టర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో సెంటిమెంట్ రాజకీయాలు

**హైదరాబాద్ :**

రాజకీయాల్లో కొన్ని బహిరంగస్నేహాలు ఉంటాయి. అంతర్గత స్నేహాలూ ఉంటాయి. అయితే రాజకీయ స్నేహాలన్నీ పరస్పర ప్రయోజనాలను బట్టే ఉంటాయి. అలా గత ఆరేడేళ్ల నుంచి తెలంగాణ నుంచి బీఆర్ఎస్, ఏపీ నుంచి వైఎస్ఆర్‌సీపీ మధ్య స్నేహం ఉంది. ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత కూడా ఆ స్నేహం కొనసాగుతోంది. అసలు ట్విస్ట్ ఏమిటంటే ప్రభుత్వాలకు సంబంధించిన అధికారిక అంశాలపై వివాదాలు వస్తే.. సంబంధిత వ్యవస్థలను ఆశ్రయిస్తారు కానీ ఈ రెండు పార్టీలు ఎప్పుడూ రాజకీయంగా దూషించుకోలేదు.. పోటీ పడలేదు. అలా సత్సంబంధాలు నిర్వహిస్తున్న సమయంలో అప్పుడప్పుడూ రెండు పార్టీల మధ్య రాజకీయ అంశాల్లో దుమారం రేగుతూ ఉంటుంది. ఓ సారి కేటీఆర్ ఏపీ నరకం అయిందని వ్యాఖ్యలు చేసినప్పుడు.. మరోసారి వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టినప్పుడు హరీష్ రావు , ప్రశాంత్ రెడ్డి లాంటి మంత్రులు విమర్శలు చేసినప్పుడు..అలాగే గోదావరి వరదలు వచ్చినప్పుడు పోలవరం గురించి బీఆర్ఎస్ నేతలు స్పందించినప్పుడు వివాదాలొచ్చాయి. కానీ రెండు రోజుల్లో సద్దుమణిగి పోయాయి. మళ్లీ ఇప్పుడు హరీష్ రావు చేసిన వ్యాఖ్యలతో మళ్లీ దుమారం ప్రారంభమయింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై అవిశ్రాంతంగా పోరాడుతున్న కేసీఆర్.. విశాఖ స్టీల్ ప్లాంట్ బిడ్ లో పాల్గొనాలని నిర్ణయించ?కున్నారు. అటు బీజేపీని ఇరుకున పెట్టడంతో పాటు ఏపీలోనూ అడుగు పెట్టినట్లవుతుందని వ్యూహం సిద్ధం చేసుకున్నారు. అయితే ఇది వైఎస్ఆర్‌సీపీకి ఇబ్బందికరం అవుతుందని ఆలోచించలేదు. అధికార పార్టీ వైసిపికి మింగుడు పడటం లేదు. స్టీల్ ప్లాంట్ చుట్టూ ఎపి రాజకీయాలు మొత్తం నడుస్తున్నాయి. సింగరేణి బృందం విశాఖ స్టీల్ ప్లాంట్ లో అడుగుపెట్టిన వెంటనే వైసిపి స్వరాన్ని మరింత పెంచింది.. విశాఖ జిల్లాకు చెందిన మంత్రి గుడివాడ అమర్నాథ్ బిఆర్ ఎస్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. స్టిల్ ప్లాంట్ బిడ్ లో పాల్గొనడం అంటే ప్రైవేటీకరణకు బిఆర్ ఎస్ జై కొట్టడమే నంటూ ఆ పార్టీని విమర్శించారు.. తాము మాత్రం విశాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామని తేల్చి చెప్పారు..

స్టీల్ ప్లాంట్ విషయంలో బీఆర్ఎస్ తమ రాజకీయ లబ్ది కోసం ప్రయత్నిస్తోందని.. తమను ఇబ్బంది పెడుతోందన్న అసహనం వైఎస్ఆర్‌సీపీలో కనిపిస్తూండటంతో పాటు తాజాగా హరీష్ రావు ఏపీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వ్యాఖ్యలు చేశారు. ఎపిలో రోడ్లే సరిగా ఉండవన్న తెలంగాణ మంత్రి హరీష్ రావుపై మంత్రులు కారుమూరి, అప్పలరాజు , బొత్స వంటి వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రాన్ని మీ చేతిలో పెడితే ఏం చేశారో తెలియదా? అంటూ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో వర్షం వస్తే ఇళ్ల మీద నుంచి నీళ్లు వెళ్తున్నాయి. మీ రాష్ట్రంలో స్కూళ్లు, మా రాష్ట్రంలో స్కూళ్ల తేడా చూసుకో. తెలంగానలో సంక్షేమ పథకాలు.. మా సంక్షేమ పథకాలకు తేడా చూడు. జీడీపీలో మేం దేశంలోనే నంబర్ వన్‌లో ఉన్నాం. ముందు మీ రాష్ట్రం సంగతి చూసుకో. ధనిక రాష్ట్రాన్ని మీ చేతిలో పెడితే ఏం చేశారో తెలియదా? అంటూ హరీష్ కు కౌంటర్ ఇచ్చారు. హరీష్ కూడా కౌంటర్ ఇచ్చారు. మాతో పెట్టుకుంటే మీకే నష్టమని హెచ్చరించారు. వైఎస్ఆర్‌సీపీ, బీఆర్ఎస్ రాజకీయాలపై చాలా మందికి డౌట్ ఉంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు వ్యూహం కావొచ్చునన్న సందేహాలు కూడా ఉన్నాయి. ఏపీలో బీఆర్ఎస్ ఎంట్రీ తమకు మేలు చేస్తుందన్న అభిప్రాయంతో వైఎస్ఆర్‌సీపీ ఉందని చెబుతున్నారు. కాపు సామాజికవర్గం కార్డ్ తో బీఆర్ఎస్ ఏపీలోకి ఎంట్రీ ఇస్తోంది. ఈ కారణంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోతాయని రెండు, మూడు శాతం ఓట్లు చీలినా ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లుగా చెబుతున్నారు. అందుకే ఈ రెండు పార్టీలు తెర వెనుక మాట్లాడుకుని తెర ముందు రాజకీయ విమర్శలు చేస్తున్నారన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. రాజకీయాల్లో ఏది వ్యూహమో.. ఏది ఆవేశంతో చేస్తున్నారో అంచనా వేయడం కష్టం. కానీ రాజకీయాల్లో ఆవేశం చూపిస్తే నేతలు ఎక్కువ కాలం ఉండలేరు. ఏం చేసినా పకడ్బందీగా ఆలోచించి .. ఆవేశమో.. మరొకటో చూపించే నేతలే ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉంటారు. అందుకే.. ఇప్పుడు ఈ రెండు పార్టీలు చేస్తున్న రాజకీయాలు పరస్పర ప్రయోజనకరంగానే ఉంటాయని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఏం జరగబోతోందో ముందు ముందు క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# ఢిల్లీకి బండి సంజయ్

**హైదరాబాద్:**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హుటాహుటిన హస్తినకు పయనమయ్యారు. పార్టీ హైకమాండ్ నుంచి అత్యవసర పిలుపు రావడంతో వెంటనే ఆయన బయలుదేరారు. తెలంగాణలో చేరికలు పెంచాలని జాతీయ నేతలు ఆదేశించారు. ఈ మేరకు కాషాయ నేతలు శరవేగంగా పావులు కదుపుతున్నారు. అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని వదుల ుకోవద్దని తెలంగాణ కాషాయ సారథి బండి సంజయ్ భావిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణరావును బీజేపీలోకి లాగాలని కమలదళం ప్లాన్ చేస్తోంది.కాగా కాంగ్రెస్ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరిక దాదాపు కన్ఫమ్ అయినట్లు సమాచారం. కాషాయతీర్థం పుచ్చుకుంటారని తెలుస్తోంది. ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రభావితం చేయగలిగిన నేత. పొంగులేటి ఉమ్మడి ఖమ్మంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందారు. ఉమ్మడి మహబూబ్ నగర్‌పై జూపల్లి కృష్ణారావు తనదైన ముద్ర వేశారు. ఈ ముగ్గురు మూడు ఉమ్మడి జిల్లాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వారిని బీజేపీలోకి లాగితే పార్టీ మరింత బలోపేతమవుతుందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది.ఇదిలా ఉండగా ఇప్పటికే బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సైతం మంగళవారమే ఢిల్లీకి వెళ్లారు. పొంగులేటి, జూపల్లి పార్టీలో చేరితే వారికి ఎలాంటి భరోసా కల్పిస్తామనే అంశంపై ఇప్పటికే ఈటల రాజేందర్ హైకమాండ్‌తో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. దీంతో వారు కూడా త్వరలోనే కాషాయతీర్థం పుచ్చుకుంటారని సమాచారం. జాయినింగ్‌తో పాటు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కీలక నిర్ణయాలు తీసుకునే చాన్స్ ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా వరంగల్ సీపీ రంగనాథ్‌పై కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు బండి సంజయ్ ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే వరంగల్ సీపీపై బండి ఫైల్ సిద్ధం చేసి పెట్టుకున్నారు. అరెస్టు చేసిన విధానంపై పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసే అవకాశాలున్నాయి.

# విశాఖ ఉక్కు సరే.. ఇక్కడ సంగతేంటీ

**హైదరాబాద్ :**

తెలంగాణలో మూతపడిన పరిశ్రమలను తెరిచే దిక్కులేదు కానీ, విశాఖ ఉక్కు పరిశ్రమ గురించి మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరుస్తామని చెప్పారని, ఆ హామీ ఇచ్చి ఇన్నేళ్లయినా ఎందుకు అమలు చేయడం లేదని ఎంపీ లక్ష్మణ్ నిలదీశారు. హెచ్ఎంటీ, ఐడీపీఎల్, అజంజాహీ మిల్ మాటేమిటని ప్రశ్నించారు. ఈ భూములపైన బీఆర్ఎస్ నేతలు కన్నేశారని అందుకే వాటిని తెరిపించే విషయంలో మౌనం వహిస్తున్నారని లక్ష్మణ్ ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో డిమాండ్ కు తగ్గ బొగ్గు ఉత్పత్తి లేకపోవడంతో దిగుమతి చేసుకునే వారని, వారికి కావాల్సిన వారికి బొగ్గు నిక్షేపాలు ఇచ్చేసి బొగ్గు కుంభకోణంలో కాంగ్రెస్ కూరుకుపోయింది. బయ్యారం ప్రమేయం లేకుండానే కడప స్టీల్ ప్లాంటు నడుస్తోందని, కడపలో జిందాల్ స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. నల్లగొండలో యురేనియం పుష్కలంగా ఉంది, అక్కడ నిక్షేపాలను వెలికి తీస్తే అనేక మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. వీటికి దిక్కు లేదు కానీ , వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు వెళ్తారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్.. తన చుట్టూ పది మందిని పెట్టుకుని నోటికి హద్దూ అదుపూ లేకుండా మాట్లాడుతున్నారని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని కొల్లగొడుతుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని లక్ష్మణ్ హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ వాడిన భాషను ఆంధ్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని, ఇప్పుడు విశాఖ స్టీల్ అంటూ మోసం చేయాలని చూస్తున్నారనీ, అయితే జనం నమ్మరని అన్నారు. జాతీయ పార్టీ అని చెప్పుకునే కేసీఆర్ కు ఏపీలో పార్టీ సింబల్‌కే దిక్కు లేని పరిస్థితి ఉందన్నారు. ముందు మన ఇల్లు చక్కదిద్దుకుని... తర్వాత పక్కోడి ఇల్లు గురించి తీరిగ్గా ఆలోచించాలని లక్ష్మణ్ కేసీఆర్ కు సూచించారు.

# కర్ణాటకలో పార్టీలకు అసమ్మతి సెగ

**బెంగళూరు :**

ర్నాటక ఎన్నికల్లో టిక్కెట్లు దొరకని నేతల నిరసనలు కొనసాగుతున్నాయి. చివరిక్షణంలో తనకు బీజేపీ టిక్కెట్ లభిస్తుందన్న ఆశలో ఉన్నారు మాజీ సీఎం జగదీశ్ శెట్టార్. టిక్కెట్ లభించని నేతలు రాత్రికి రాత్రి పార్టీలు మార్చేస్తున్నారు. గెలుపు గుర్రాలకు టిక్కెట్లు ఇచ్చామని స్పష్టం చేశారు సీఎం బస్వరాజ్ బొమ్మై.కర్నాటక అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య మైండ్‌గేమ్ కొనసాగుతోంది. కర్నాటక ఎన్నికల ముందు జంపింగ్స్ కహానీలో మరో ట్విస్ట్ ఇది. కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ తిమ్మప్ప కూతురు రాజనందిని బీజేపీలో చేరారు. తన బిడ్డ పార్టీ మారుతుందని తాను ఊహించలేదన్నారు ఆమె తండ్రి తిమ్మప్ప. దీని వెనక ఏదో ఉందని చెప్పారాయన. అయితే కాంగ్రెస్ తనకు టికెట్ ఇవ్వలేదనీ, తాను కష్టపడినా గుర్తించకపోవడంతోనే పార్టీ మారినట్లు రాజనందిని చెప్పారు.మరోవైపు ఈసారి కూడా తనకు తప్పకుండా బీజేపీ నుంచి పోటీ చేసే అవకాశం లభిస్తుందని అంటున్నారు మాజీ సీఎం జగదీశ్ శెట్టార్. ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు నడ్డాతో జగదీశ్ శెట్టార్ భేటీ అయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా తాను పోటీ చేస్తానని తెలిపారు. హుబ్లీ నుంచి జగదీశ్ శెట్టార్‌కు మళ్లీ పోటీ చేసే అవకాశం కచ్చితంగా లభిస్తుందని తెలిపారు యడియూరప్ప.బీజేపీ టిక్కెట్లు లభించిన నేతల ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇచ్చామని స్పష్టం చేశారు సీఎం బస్వరాజ్ బొమ్మై. బీజేపీ 52 మంది కొత్తవారికి అవకాశం కల్పించింది. దీంతో పార్టీలో అసమ్మతి మొదలైంది. టికెట్ దక్కని నేతలు పార్టీ నుంచి వీడేందుకు సిద్ధమవుతున్నారు.224 అసెంబ్లీ స్థానాలున్న కర్ణాటకలో మే 10న ఎన్నికలు జరుగుతాయి. 189 మంది అభ్యర్థులతో తొలి జాబితాను బీజేపీ విడుదల చేసింది. ఇందులో 52 మంది కొత్తవారికి ఈ సారి అవకాశం కల్పించింది. అయితే ఎన్నికల వేళ సంచలన ఆరోపణలు చేశారు పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్. ప్రతి నియోజకవర్గంలో వేల సంఖ్యలో అక్రమ ఓటర్లను చేర్పించారని. బెంగళూర్ లోనే 40 వేల మంది నకిలీ ఓటర్ల జాబితాను గుర్తించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించినట్లు తెలిపారు.కర్ణాటకలో తొలి అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది బీజేపీ. దీనిపై ఇప్పటికే సెగ మొదలైంది. టికెట్ ఎక్స్‌పెక్ట్ చేసిన కొందరు నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ సీనియర్ నేత, మంత్రి లక్ష్మణ్ సవది పార్టీని వీడారు. తనకు టికెట్ దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన లక్ష్మణ్...బీజేపీని వీడుతున్నట్టు ప్రకటించారు. ఆయన కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈయన ఒక్కరే కాదు. మరి కొంత మంది కూడా అసంతృప్తి నేతలున్నారని, వాళ్లు కూడా కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని సమాచారం. మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పకు అత్యంత సన్నిహితుడైన లక్ష్మణ్ సవది పార్టీ నుంచి వెళ్లిపోవడం బీజేపీకి గట్టి షాకే ఇచ్చింది. లింగాయత్ లీడర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన జనసమీకరణలోనూ ఆరితేరారు. అలాంటి వ్యక్తిం పార్టీ వీడడం వల్ల ఆ వర్గం ఓట్లు చీలిపోయే అవకాశముంది. 2012లో అసెంబ్లీలోనే అశ్లీల వీడియోలు చూస్తూ దొరికిపోయారు. అప్పట్లో అది వివాదాస్పదమైంది. ఆ తరవాత 2018లో లక్ష్మణ్ కాంగ్రెస్ అభ్యర్థిపై పోటీ చేసి ఓడిపోయారు. కొద్ది రోజులకే కాంగ్రెస్-జనతా దళ్ సెక్యులర్ ప్రభుత్వం కూలిపోయింది. చాలా మంది కాంగ్రెస్ నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ క్రమంలోనే ఆయన బీజేపీలో చేరారు. ఈ సారి ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడం లక్ష్మణ్‌ను అసహనానికి గురి చేసింది. మాజీ ముఖ్యమంత్రి జగదీష్ షెట్టర్ పేరు కూడా బీజేపీ లిస్ట్‌లో లేదు. ఇప్పటికే ఢిల్లీ వెళ్లి మంతనాలు జరుపుతున్నారు జగదీష్. కానీ...అధిష్ఠానం మాత్రం టికెట్ ఇచ్చేందుకు ససేమిరా అన్నట్టు సమాచారం. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిజానికి..ఈ లిస్ట్ ప్రకటించక ముందే బీజేపీ సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప రాజకీయాలకు రిటైర్‌మెంట్ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని తేల్చి చెప్పారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల వేడి రోజు రోజుకూ పెరుగుతోంది. నాటు నాటు స్టెప్పులతో ప్రచారాలు, బీజేపీ-కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం, రైతు బిడ్డను పెళ్లి చేసుకుంటే రూ.2 లక్షలు హామీలు ఇలా పార్టీలు ప్రచార స్పీడ్ పెంచాయి. అయితే అభ్యర్థుల కసరత్తు పార్టీలకు పెద్ద చిక్కు తెచ్చిపెట్టింది. దాదాపు మూడు రోజుల కసరత్తు అనంతరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. బీజేపీ ఫస్ట్ లిస్ట్ లో 189 మంది అభ్యర్థుల పేర్లు ఖరారు చేసింది. కర్నాటక అసెంబ్లీలో మొత్తం 224 స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. భారతీయ జనతా పార్టీ మంగళవారం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 189 మంది అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై షిగ్గాం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండగా... బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి చిక్కమగ్లూరు స్థానానికి పోటీ చేస్తున్నారు. అభ్యర్థుల ఖరారుపై పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ, పార్లమెంటరీ బోర్డు సుదీర్ఘంగా చర్చించింది. దాదాపు మూడు రోజుల చర్చల అనంతరం తొలి జాబితా విడుదల అయింది.

# పాపం... సుస్మిత లౌకిక్

**హైదరాబాద్ :**

చేసిన తప్పు ఎవర్నీ కుదురుగా ఉండనివ్వదు. వారిది అదే పరిస్థితి. వాళ్లే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో నిందితులు. ప్రధాన నిందితులతో చేతులు కలిపి పేపర్ తీసుకున్న పాపానికి నెల రోజుల పాటు నిద్రలేకుండా జాగారం చేశారు. గుడులు గోపురాలు సందర్శించారు. కనిపించిన దేవుడిని మొక్కారు. తమను ఈ గండం నుంచి గట్టెక్కించాలని వేడుకున్నారు. అయినా పాపం పండింది. కటకటాలు లెక్కించాల్సి వచ్చింది. తెలంగాణ పబ్లిష్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసు నిందితుల్లో సుస్మిత, లౌకిక్ కూడా ఉన్నారు. సుస్మిత సాఫ్ట్ వేర్ ఇంజినీర్. గ్రూప్ వన్ నోటిఫికేషన్ వచ్చాక ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రిపేర్ అయ్యారు. గ్రూప్-1 రాశారు. అయితే ఆమె చేసిన చిన్న తప్పిదం కారణంగా గ్రూప్ వన్ రిజల్ట్ రాలేదు. ఆమె రిజల్ట్‌ను విత్‌హెల్డ్‌లో పెట్టారు. బాగా రాశానన్న కాన్ఫిడెన్స్‌తో పలుమార్లు టీఎస్‌పీఎస్సీ ఆఫీస్‌కు వెళ్లి తన రిజల్ట్ రాకపోవడానికి, చేసిన తప్పు సరిచేసుకోవడానికి ప్రయత్నాలు చేశారు. గ్రూప్ వన్ రిజల్ట్ విషయం మాట్లాడటానికి వెళ్లిన సుస్మిత, ఆమె భర్త లౌకిక్‌కు అక్కడే పరిచయమయ్యాడు ప్రవీణ్. ఆమె డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష కూడా రాస్తున్నట్టు గ్రహించాడు. అంతే సైలెంట్‌గా వారితో బేరం పెట్టాడు. రాబోయే పరీక్షకు సంబంధించిన పేపర్ తనవద్ద ఉందని.. చెప్పి డబ్బులు వసూలు చేశాడు. వీళ్ల మధ్య ఆరు లక్షలకు బేరం కుదిరింది. భార్య సుస్మిత కోసం ప్రవీణ్‌కు ఆరులక్షలు ఇచ్చాడు లౌకిక్. పరీక్షను విజయవంతంగా రాశారు సుస్మిత. గ్రూప్ -1 రిజల్ట్ వచ్చినా రాకున్నా డీఏఓ ఉద్యోగం మాత్రం వస్తుందని సంతోషంగా ఉన్నారు. ఇంతలో పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ న్యూస్ చూసిన సుస్మిత, లౌకిక్ గుండెల్లో రాయిపడ్డట్టు అయింది. రోజుకొకర్ని అరెస్టు చేయడం... ప్రవీణ్‌తో జరిగిన ఆర్థిక లావాదేవీలు, ఫోన్ సంభాషణల ఆధారంగా కేసు సీరియస్ అవుతండటంతో వారిలో టెన్షన్ మరింత పెరిగింది. చేసింది తప్పని దొరికి పోతున్నామని భయం పట్టుకుంది సుస్మిత, లౌకిక్. అంతే తిరుపతి నుంచి షిర్డీ వరకు కనిపించన ఆలయాలకు వెళ్లారు. నెలరోజుల పాటు నిద్రాహారాలు లేకుండా తమను రక్షించాలని దేవుణ్ని వేడుకున్నారు. ఎన్ని మొక్కులు చెల్లించుకున్నా.. మరిన్నె ముడుపులు కట్టినా వారి వ్రతాలు, పూజలు ఫలించలేదు. చివరకు ప్రవీణ్‌తో జరిపిన లావాదేవీలు, సంబాషణలు, చాటింగ్ ఆధారంగా సుస్మిత, లౌకిక్‌ను ఐదు రోజుల క్రితం పోలీసులు అరెస్టు చేశారు.

# అతి పిన్నవయస్కుడికి మూత్రపిండ మార్పిడి

**హైదరాబాద్**



ఆరుదైన మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న 12 ఏళ్ల చిన్నారికి నిమ్స్ వైద్యులు విజయవంతంగా మూత్రపిండ మార్పిడి చేశారు. మూత్రపిండాలు పూర్తిగా పనిచేయని దశకు చేరుకున్న సమయంలో బాలుడికి భవిష్యత్ కు మెరుగైన జీవితం అందించారు. అత్యంత అరుదైన మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్న ఆ బాలుడికి మూత్రపిండ మార్పిడిని విజయవంతంగా నిర్వహించి బాలుడికి జీవితాన్నందించారు. తెలంగాణలోని మహబూబ్ నగర్ కు చెందిన బాలుడు 6వ తరగతి చదువుతున్నాడు .ఈ బాలుడి తల్లిదండ్రులు పేదవారు. తండ్రి కూలీ పనులు చేసుకుంటుండగా తల్లి కొడుకు ఆరోగ్యం చూసుకుంటూ ఇంటిపట్టునే ఉండేది.ఈ చిన్నారి బైలేటరల్ వెసికోర్టెరిక్ రిఫ్లక్స్ అనే మూత్రనాళ సమస్యతో బాధపడుతున్నాడు. ఇది పుట్టుకతో వచ్చే సమస్య. దీంతో కిడ్నీ ఫెయిల్యూర్ అయి ఏడాదిక్రితం నుంచి డయాలసిస్ మీదే బతుకుతున్నాడు. నిమ్స్ డాక్టర్స్ పూర్తిగా బాలుడి పరిస్థితిని పరిశీలించి రెండు స్టేజుల్లో చేయాలసిన ప్రొసీజర్ కు ప్రణాళిక రూపొందించారు. మొదట ఎడమ నెఫ్రోరెక్టమీ ని తర్వాత కుడి నెఫ్రోరెక్టమీ ని లాప్రోస్కోపిక్ ద్వారా శస్త్రచికిత్స చేశారు.ఆ తర్వాత రెండవ దశలోనే మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సని విజయవంతంగా చేశారు నిమ్స్ యూరాలజీ నిపుణులు. ఆపరేషన్ తర్వాత బాలుడి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడింది.మూత్రపిండాల పనితీరు సాధారణ స్థితికి చేరుకుంది. సీరమ్ క్రెటినైన్ స్థాయిలు కూడా 7 నుంచి 0.4 కు తగ్గినట్లు డాక్టర్లు తెలిపారు. ఇక కొడుకుకు కిడ్నీని దానం చేసిన బాలుడి తల్లి ఆరోగ్యం కూడా భాగుందని డాక్టర్లు తెలిపారు. నిమ్స్ యూరాలజి డిపార్ట్మెంట్ హెడ్ అయిన ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంత చిన్న వయసు బాలుడికి ఇలాంటి సర్జరీ జరగడం ఇదే మొదటిసారన్నారు. బాలుడి చికిత్సకయ్యే ఖర్చులన్నీ తెలంగాణ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశామాన్నారాయన.

తమకు ప్రోత్సాహన్నిందిస్తున్న తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు, నిమ్స్ డైరక్టర్ డాక్టర్ బీరప్పలకు నిమ్స్ యూరాలజీ టీమ్ ధన్యవాదాలు తెలిపింది.

డాక్టర్ దేవరాజ్ తో పాటు యూరాలజిస్ట్ లు డాక్టర్ రామ్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రామచంద్రయ్య, డాక్టర్ చరణ్, డాక్టర్ ధీరజ్, డాక్టర్ వినయ్, డాక్టర్ సునిల్, డాక్టర్ అరుణ్, డాక్టర్ విష్ణు, డాక్టర్ హర్ష, డాక్టర్ జానకి, డాక్టర్ పవన్, డాక్టర్ సూరజ్, డాక్టర్ పూవర్సన్, డాక్టర్ అనంత్, డాక్టర్ షారూక్ లు విజయవంతంగా బాలుడి శస్త్రచికిత్సను పూర్తి చేశారు. వీరికి అనస్తీసియాలజీ నిపుణులైన డాక్టర్ నిర్మల, డాక్టర్ ఇందిర, డాక్టర్ కిరణ్, షిబానీతో పాటు నెఫ్రాలజిస్ట్ లైన డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ గంగాధర్, డాక్టర్ భూషన్ రాజులు సాయమందించారు.

# నడి సంద్రంలో తీరప్రాంత రక్షణ దళం మాక్ డ్రిల్

**విశాఖపట్నం**

భారతీయ తీరప్రాంత రక్షణ దళం-కోస్ట్ గార్డ్ తూర్పు రీజియ న్ ఆధ్వర్యంలో కాకినాడ కాలుష్య విపత్తు స్పందన మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. పొల్యూషన్ రెస్పాన్స్ ఎక్సర్ సైజ్ -2023 పేరిట సముద్రంలో 20 కిలోమీటర్ల లోపల ఈ ఎక్స్ ర్ సైజ్ నిర్వహించారు. ప్రమాదం సంభవించి ఆయిల్ ట్యాంకర్ నుంచి చమురు సముద్రంలోకి ఒలికిపో తే...సురక్షితంగా ఒడ్డుకు చేర్చే విధానాన్ని మాక్ డ్రిల్ లో సిబ్బంది ప్రదర్శించారు.చమురు తెట్టును సముద్రపు జలాల నుంచి తొలగించడంలో కోస్ట్ గార్డ్ యూనిట్లు, చమురు సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇతర భాగస్వామ్య సంస్థల శక్తి సామర్థ్యాలను పరిక్షించేందుకు..... ఈ డ్రిల్ ను నిర్వహించినట్లు కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు.

## ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

**విజయవాడ**

కృష్ణాజిల్లా నిమ్మకూరులో పండుగ వాతావరణం నెలకొంది. గురువారం నాడు నిమ్మకూరులో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల ప్రారంభోత్సవం జరిగింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్టీఆర్, బసవతారకం చిత్రపటాలకు నివాళులు అర్పించారు. నిమ్మకూరు వాసులతో చంద్రబాబు ఆత్మీయ సమావేశం అయ్యారు. చంద్రబాబుకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు రామకృష్ణ, సుహాసిని నూతన వస్త్రాలు అందించారు.

## స్టీల్ ప్లాంట్ పై కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు

**విశాఖపట్నం**

వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖ పోర్టు కళావాణి స్టేడియంలో నిర్వహించిన రోజ్ గార్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికిప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం చేయాలని అనుకోవడం లేదు. స్టీల్ ప్లాంట్ కొన్ని కొత్త విభాగాలు ప్రారంభిస్తున్నాం. స్టీల్ ప్లాంట్ ను బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ముడిసరకు పెంపొందించే ప్రక్రియపై దృష్టి పెట్టాం. ఆర్ఐఎన్ఎల్ అధికారులతో భేటీ అవుతున్నామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బిడ్డింగ్లో పాల్గొనడం వారి పరిధిలోని విషయం అని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటాను

**హైదరాబాద్**

ఖమ్మం జిల్లా లోని చీమలపాడులో జరిగిన అగ్ని ప్రమాద ఘటన, తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు అనారోగ్యం పరిస్థితుల దృష్ట్యా ఈనెల 19న తన పుట్టినరోజు సందర్భంగా జన్మదిన వేడుకలకు తాను దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రకటించారు. అభిమానులు, కార్యకర్తలు పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు జన్మదిన సంబరాలకు బదులు స్థానికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు సహాయం చేయాలని ఈ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేశారు. చీమలపాడు అగ్ని ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని మంత్రి అజయ్ తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కారణంగానే తాను జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నట్టు మంత్రి చెప్పారు.

## క్షతగాత్రులను పరామర్శించిన మంత్రులు

**హైదరాబాద్**



ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం చీమలపాడు అగ్నిప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం నుండి హైదరాబాద్ నిమ్స్ కు తరలించారు. గురువారం ఐటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపిలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర నిమ్స్ ఆసుపత్రికి వెళ్ళి క్షతగాత్రులను కలిసి పరామర్శించారు. ఏమి అధైర్య పడొద్దని, వారి కుటుంబాలకు ధైర్యం కల్పించారు. పూర్తిగా కోలుకునే వరకు అన్ని రకాల వైద్య చికిత్సలు ఉచితంగానే అందిస్తామని, ధైర్యం కోల్పోవొద్దు ధైర్యం చెప్పారు. ఎలాంటి వైద్య సేవలైన తక్షణమే అందించాలని, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన చికిత్సలను అందించాలని వైద్యులను, నిమ్స్ అధికారులను మంత్రులు అదేశించారు.

## గ్రేటర్ కమిషనర్‌కు ఘన వీడ్కోలు

**విశాఖపట్నం:**

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా విధులు నిర్వహించి కృష్ణాజిల్లా కలెక్టర్ గా బదిలీపై వెళ్తున్న పి. రాజాబాబుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. దీనిలో భాగంగానే సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, వైజాగ్ జర్నలిస్టుల ఫారం అధ్యక్షులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, విశాఖ విమానాశ్రయ అభివృద్ధి సలహా మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు కమిషనర్ దంపతులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా నే సింహాద్రినాథుని చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధిలో కమిషనర్ రాజాబాబు చేసిన సేవలు మరువలేనివని, జి20 సమావేశాలు, పెట్టుబడుల సదస్సులను జీవీఎంసీ పరిధిలో అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేశారన్నారు.

## మంత్రి బొత్స ను కలిసిన ఎమ్మెల్సీ లు

**విజయవాడ**

విజయవాడలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ని ఎమ్మెల్సీ లు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , కల్పలత రెడ్డి, యం వి రామచంద్రా రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కి ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు పెంపు,స్పాట్ వాల్యుయేషన్ పేపర్ రెమ్యునరేషన్ పెంపు పై వారు చర్చించినారు. ప్రైవేట్ పాఠశాలలకు 8 సంవత్సరాల గుర్తింపు కు మంత్రి బొత్స సత్యనారాయణ అంగీకరించి ఉత్తర్వులు విడుదలకు ఆదేశాలిచ్చారు. అలాగే 10 వ తరగతి స్పాట్ వాల్యుయేషన్ లో పేపర్ రెమ్యునరేషన్ పెంచేందుకు కూడా మంత్రి అంగీకారం తెలిపారు

# చిన్న పిల్లల చాక్లెట్లలో కల్తీ

**హైదరాబాద్ :**

చిన్న పిల్లలకు చాక్లెట్లు, ఐస్ క్రీములు, లాలీ పప్స్ ఎంతగా ఇష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏడాది పిల్లాడి నుంచి పదేళ్ల పిల్లలు వాటిని మరింత ఎక్కువగా తింటుంటారు. ఎక్కడ కనిపించినా కొనేంత వరకు తల్లిదండ్రులను వదిలి పెట్టరు. పిల్లలు బాగా మారాం చేస్తున్నారు కదా అని మనం కూడా పిల్లల కోసం వాటిని కొంటుంటాం. కానీ అలాంటివే మన పిల్లలను ప్రాణాలు కూడా తీస్తాయి. వీటికే ఇలా జరుగుతుందా అనుకుంటున్నారా.. జరిగే ఛాన్స్ చాలా ఎక్కువగా ఉందండి. ఎందుకంటే నకిలీ చాక్లెట్లు, ఐస్ క్రీంలు తయారు చేస్తుంటే కాస్త తక్కువ ధరకు అమ్ముతుంటారు. వాటిలో ప్రమాదకర రసాయనాలను కలిపి పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు రావడానికి కారణం అవుతారు. హా అదెక్కడో జరుగుతుంది లెండి.. తినిపిస్తే ఏం కాదనుకుంటే మీరు పెద్ద తప్పే చేసిన వాళ్లు అవుతారు. ఎందుకంటే తాజాగా హైదరాబాద్ లోనే నకిలీ చాక్లెట్లు, లాలీ పప్స్ తయారు చేసే కేంద్రం బయట పడింది. హైదరాబాద్ రాజేంద్ర నగర్ లోని అత్తాపూర్ లో దారుణం చోటుచేసుకుంది. అనుమతులు లేకుండా నివాస ప్రాంతాల మధ్యనే అక్రమంగా చాక్లెట్ల పరిశ్రమ దందాను కొందరు మొదలుపెట్టారు. అంతే కాదండోయ్ మాదకర రసాయన పదార్థాలు, కలుషిత నీటితో చాక్లెట్లు, లాలీ పప్స్ తయారు చేస్తున్నారు. పెద్ద పెద్ద డ్రమ్ముల్లో నిలువ ఉంచిన పానకంతోనే వాటిని తయారు చేస్తున్నారు. అలాగే వాటిని నేరుగా తీసుకెళ్లి మార్కెట్ లో విక్రయిస్తున్నారు. అయితే స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్ఓటీ పోలీసులు రంగంలోకి దిగారు. నకిలీ చాక్లెట్లు తయారు చేస్తున్న తయారీ కేంద్రంపై దాడులు జరిపారు. డ్రమ్ముల్లో నిలువ ఉంచిన పానకాన్ని పారబోశారు. అయితే నిందితులు తప్పించుకున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏమాత్రం అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీపై హెల్త్ అడిషనల్ కమిషనర్ శ్రుతి ఓజాతో కలిసి మేయర్ సమీక్షించారు. నగరంలో కల్తీ నియంత్రణకు ఏర్పాటుచేసిన ఫుడ్ ఆన్ వీల్స్ ద్వారా తప్పనిసరిగా తనిఖీలు చేసి కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు మేయర్ విజయలక్ష్మి. ఫుడ్ సేఫ్టీ అధికారుల పరిధిలో షాపులను, రెస్టారెంట్లను విధిగా తనిఖీ చేసి, కల్తీ ఉన్నపక్షంలో వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు. కొందరు అధికారులు నామమాత్రంగా చెక్‌చేసి, కల్తీ ఉన్నట్టు రుజువైనా, ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉంటున్నారని, అది తన దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. ఇకనైనా వారు తమ పనితీరు మార్చుకోవాలని సూచించారు. లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని మేయర్ హెచ్చరించారు గతంలో రోజువారి తనిఖీల లెక్కలు పంపమని ఆదేశించినా, ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి సమాచారం ఇవ్వలేదని మేయర్ అసహనం వ్యక్తంచేశారు. స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు, మీల్స్ సెంటర్లు, హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లను రెగ్యులర్ తనిఖీలు చేయాలని గట్టిగా ఆదేశించారు.

# ఆసక్తికరంగా దుబ్బాక రాజకీయం

**మెదక్ :**

సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మరోసారి గెలిచి సత్తా చాటాలని బీజేపీ చూస్తుంటే పోయిన చోటే వెతుక్కోవాలన్న సామెతని నిజం చేయాలని బీఆర్ఎస్ వ్యూహాలకు పదును పెడుతోంది. దుబ్బాక నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఎంపీ ప్రభాకర్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారట. ఇలాంటి సమయంలోనే దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో?కొత్త లొల్లి మొదలైందట. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలపై?వ్యతిరేక గళం ఎత్తుతున్నారట సొంత పార్టీ నేతలు. కొన్ని రోజుల క్రితం దుబ్బాక బీజేపీ సీనియర్ నాయకులంతా కలిసి?రఘునందన్‌కు వ్యతిరేకంగా ఓ రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారట. ఎమ్మెల్యే రఘునందన్‌రావు పార్టీలో ఉన్న సీనియర్ నాయకులను పట్టించుకోవట్లేదనేది వారి ప్రధాన ఆరోపణ. ఆ తర్వాత జనవరి 29న కూడా మరోసారి దుబ్బాక నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల బీజేపీ నాయకులు మరోసారి సమావేశమయ్యారట. బీజేపీలో ఉన్న వ్యతిరేక గళం ఇప్పు డు బీఆర్ఎస్‌లోనూ మొదలైందంట. బీఆర్ఎస్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి?దుబ్బాక మండలంలోని నాయకులపై వివక్ష చూపుతున్నారని నామినేటెడ్ పోస్టులన్ని ఇతర మండలాల వారికే ఇస్తున్నారని ఆరోపిస్తూ సొంతం పార్టీ నేతలు రహస్య సమావేశం పెట్టుకున్నారట. దాదాపు 200 మంది బీఆర్ఎస్ నాయకులు మార్చి 16న సమావేశం ఏర్పాటు చేసుకొని అనేక అంశాలపై చర్చించుకున్నారట. రెండు పార్టీల నేతలకు వ్యతిరేకంగా కింది స్థాయి నేతలు సమావేశాలు నిర్వహిస్తుండటంతో బీజేపీ, బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన మొదలైందట. ఎన్నికలు సమీపిస్తున్న వేళ స్వపక్షంలో విపక్షంలా మారిన పార్టీ నాయకులతో.. ఇటు ఎమ్మెల్యే రఘునందన్‌రావు, అటు ఎంపీ ప్రభాకర్ రెడ్డి సతమతమవుతున్నారట. ఈ రహస్య సమావేశాల వెనుక ఇతర పార్టీల కుట్ర ఉందంటూ ఎవరికి వారు చెప్పుకుంటున్నారట. బీజేపీ రహస్య సమావేశాలకు బీఆర్ఎస్ సపోర్ట్ చేస్తుందని బీఆర్ఎస్ నాయకుల మీటింగ్‌కి బీజేపీ సపోర్ట్ చేస్తుందని ఎవరికి తోచినట్టు వారు చెప్పుకుంటున్నారట. మరి ఈ సమస్యను ఇద్దరు నాయకులు ఎలా పరిష్కరిస్తారోనని నియోజకవర్గంలో చర్చ జరుగుతోందట.

# తెలంగాణ మీ జాగీరా..మీరు ప్రాంతీయ ఉగ్రవాదులు

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ కు చెందిన కార్మికులు అక్కడ ఓటు హక్కు రద్దు చేసుకుని, తెలంగాణలో పొందాలని, ఆంధ్ర, తెలంగాణలో పాలన చూస్తున్నారు కదా.. ఏది బాగుందో చెప్పాలంటూ తెలంగాణ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ మంత్రుల కౌంటర్‌లు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మంత్రులు అమర్నాథ్, కారుమూరి నాగేశ్వరరావు తర్వాత తాజగా మంత్రి సీదిరి అప్పలరాజు కాస్త ఘాటుగా స్పందించారు. ఏకంగా సీఎం కేసీఆర్ కుటుంబాన్నే టార్గెట్ చేసి మాట్లాడారు. ప్రాంతీయ ఉగ్రవాదాన్ని ఎగదోసి తెలంగాణకు నాయకులయ్యారని మండిపడ్డారు. "నువ్వేమో మంత్రివి. మీ మామగారు (కేసీఆర్) ముఖ్యమంత్రి. ఆయనకు ఓ కొడుకు ఆయన మంత్రి (కేటీఆర్). తెలంగాణ మీ జాగీరా.. మీరు ప్రాంతీయ ఉగ్రవాదులు. నువ్వు, మీ మామ, మీ మామ కొడుకు, మీ




మామ కూతురు (కవిత) మీరందరూ ప్రాంతీయ ఉగ్రవాదులు. పనికిమాలిన మాటలు ఆపి. మీ పని మీరు చూసుకోండి. మా ఆంధ్రవాళ్లు తెలంగాణకు రావడం మానేస్తే అక్కడ ఏమీ ఉండదు. అడుక్కుతినడం తప్ప. వీళ్లు బుర్ర తక్కువ తెలంగాణ వాళ్లు" అని మంత్రి సీదిరి అప్పలరాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో జరిగిన అభివృద్ధిని, తెలంగాణలో జరిగిన అభివృద్ధితో అనుక్షణం పోలుస్తు తెలంగాణ మంత్రులు విమర్శలు చేస్తున్నారు. ఈ పరిస్థితులు రెండు రాష్ట్రాల మధ్య ఆసక్తికర పరిణామాలకు దారితీస్తున్నాయి. ఈ క్రమంలోనే మంత్రి హరీశ్‌రావు ఏకంగా ఏపీకి చెందిన కార్మికులు అక్కడ ఓటు హక్కును రద్దు చేసుకుని తెలంగాణలో పొందాలని పిలుపునివ్వడం చర్చనీయాంశమైంది. తెలంగాణలో ఏముందని అలా మాట్లాడుతున్నారంటూ ఏపీ మంత్రులు హరీశ్‌రావుపై ధ్వజమెత్తారు. దీనిపై హరీశ్‌రావు కూడా అంతే ఘాటుగా స్పందించారు. "ఆంధ్ర నేతలారా.. మా జోలికి రావద్దు.. మా గురించి మాట్లాడకపోతేనే మీకు మంచిది" అంటూ హెచ్చరించారు. హరీశ్ వ్యాఖ్యలను ఏపీ మంత్రులు తప్పుపట్టడం.. అంతే వేగంగా ఆయన సైతం స్పందించడం... తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో హరీశ్‌రావు బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదాను కేంద్రం ఎగదొబ్బినా.. అక్కడి అధికార పక్షం అడగదు, ప్రతిపక్షం ప్రశ్నించదు.. అని ఎద్దేవా చేశారు.

# కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా సతీష్ కుమార్

**కాకినాడ**

కాకినాడ జిల్లా నూతన ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ విధుల్లో చేరారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన పూర్వపు ఎస్పి ఎం రవీంద్రనాథ్ బాబు నుంచి బాధ్యతలు స్వీకరించారు. 2016 ఐపీఎస్ బ్యాచ్ కి చెందిన సతీష్ కుమార్ తమిళనాడుకు కి చెందిన వాడు. బీటెక్ (బయోటెక్నాలజీ) అభ్యసించిన సతీష్ కుమార్ కు భార్య ధరణ్య, కుమారుడు దేవరుద్రన్ ఉన్నారు. 2002లో తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 2 పరీక్ష రాసి.. ఖజానా శాఖలో ఉద్యోగం పొందారు. 2015 వరకు ఖజానా శాఖలో ఉద్యోగం చేస్తూ సెలవు పెట్టి సివిల్స్ కు సిద్ధమయ్యారు. 2016 సివిల్ సర్వీసులో ఐపీఎస్ కు ఎంపికయ్యారు. గ్రేహౌండ్ అసాల్ట్ కమిషనర్, చింతపల్లి ఏఎస్పీ, నర్సీపట్నం ఓఎస్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా పని చేస్తూ కాకినాడ జిల్లా ఎస్పీగా బదిలీపై వచ్చారు. శాంతి భద్రతలకు తొలి ప్రాధాన్యతని ఆయన మీడియాకు ఇవాళ చెప్పారు. చిన్నా పెద్ద,, పేద గొప్ప తేడా లేకుండా న్యాయం చేయడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ ఏడాది ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గంజాయి రవాణా విషయంలో పూర్వపు ఎస్పి తీసుకున్న చర్యలను పరిగణలోకి తీసుకొని తాను కూడా కఠిన చర్యలు చెప్పడతానని వివరించారు. 82 కాకినాడ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను జిల్లా పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు..

## అయూష్ ఆసుపత్రికి భూమి పూజ

**వికారాబాద్**



వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ రూ. 15 కోట్లతో నిర్మించే 50 పడకల ఆయుష్ ఆసుపత్రికి మంత్రి హరీశ్ రావు గురువారం నాడు భూమి పూజ చేసారు. రూ. 3.60 కోట్లతో నిర్మించే సెంట్రల్ మెడిసిన్ స్టోర్ కు కుడా అయన భూమిపూజ చేసారు. ఈ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్, మహేష్ రెడ్డి, నరేందర్, వైద్యాధికారులు తదితరులు పాల్గోన్నారు

## ఆగస్టు లోగా పోస్టుల భర్తీ

**హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వం లో మంజూరు అయిన పోస్ట్ లను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లించారు. ఆగస్ట్ లోపల అన్ని ఖాళీల భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తెలంగాణ ఎందులో ముందుందో అందరికీ తెలుసు. అవినీతి లో, నియంతృత్వం లో, అహంకార కుటుంబ మాఫియా పాలన లో అక్రమ లిక్కర్ కేసుల్లో ముందు ఉంది. కల్వకుంట్ల కుటుంబం అడ్డంగా మాట్లాడుతోంది. ఉద్యోగ నియామకాలు కూడా చేయాలేని అసమర్థ ప్రభుత్వం ఇది. మీ నుండి పాఠాలు నేర్చుకోవాల్సిన కర్మ మాకు లేదు. వచ్చే ఎన్నికల్లో ఎవరేంటో ప్రజలే తెలుస్తారని అన్నారు. విశాఖ స్టీల్ విషయం లో రాష్ట్ర ప్రభుత్వ తీరు ఉట్టికి ఎగరనొడు ఆకాశానికి ఎగిరినట్టు ఉంది. విశాఖ స్టీల్ ను సింగరేణి నుండి కొంటారట. అదే సింగరేణి నీ ప్రైవేట్ పరం చేయొద్దని ఆందోళన చేస్తారు. ప్రధాని వస్తే నిరసనలు చేశారు. సింగరేణి లో 51% వాటా రాష్ట ప్రభుత్వానిదే అని చెప్పినా తప్పుడు ప్రచారం చేశారు. నాటకాలు అడారు. అబద్ధాలు, బురద జల్లడం కల్వకుంట్ల కుటుంబానికి అలవాటు అయిందని ఆరోపించారు.

## ఏపీ మంత్రులవి చిల్లర వేషాలు

**హైదరాబాద్**

మంత్రి హరీష్ రావు మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదు. ఏపీ మంత్రులు చిల్లర గా మాట్లాడుతున్నారని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. .హరీష్ రావు కు ఉద్యమ నేపథ్యం ఉంది.. మీకు ఏమి ఉందని ప్రశ్నించారు.

హరీష్ రావు కు పాలనా అనుభవం ఉంది. ఏదీ మాట్లాడినా విషయం ఉంటుంది. కేసుల గురించి మాట్లాడే ఏపీ మంత్రులు ముందు తమ వీపులు చూసుకోవాలి. చిల్లర వేషాలు మీవి.. చిల్లర చేష్టలు మీవి. హైదరాబాద్ కు రావాల్సి వుంటుందని మరచిపోవద్దు. పిచ్చి మాటలు మాట్లాడితే ఖబడ్దార్. కేసుల్లో రక్షణకు పెదవులు మూసుకుంది మీరని ఆరోపించారు.

## నదీ గర్భంలో మెట్రో పరుగులు

**కోల్ కతా**

దేశంలోనే పురాతన మెట్రో సర్వీసు కోల్కతా మెట్రో చరిత్ర సృష్టించింది. భారత దేశంలోనే తొలిసారిగా ఓ మెట్రో.. నది కింద వేగంగా దూసు కెళ్లింది. హౌరా నుంచి కోల్కతాలోని ఎస్ప్లనేడ్ వరకు హుగ్లీ నది కింద రైలును నడిపారు. కోల్కతా నగరానికి ఈ రన్ చారిత్రాత్మక ఘట్టమని కోల్క తా మెట్రో జనరల్ మేనేజర్ పి ఉదయ కుమార్ రెడ్డి అభివర్ణించారు. హుగ్లీ నదిలో.. రైలు వెళ్లడం ఇదే తొలిసారని ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇది 33 మీటర్ల లోతులో ఉన్న అత్యంత లోతైన స్టేషన్. భారత్లో ఇలా జరగ డం ఇదే తొలిసారి. కోల్కతా నగరానికి ఇది చారిత్రాత్మక ఘట్టం. వచ్చే 7 నెలల పాటు హౌరా మైదాన్ నుంచి ఎస్ప్లనేడ్ వరకు ట్రయల్ రన్ కొనసాగుతుందని తెలిపారు. దీని తర్వాత ప్రజల కోసం రెగ్యులర్ గా ప్రారంభిస్తారు.

## కరెంట్షాక్తో ముగ్గురు యువకుల మృతి

**హైదరాబాద్**



నగరంలోని షేక్ పేట పారామౌంట్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి ఇద్దరు అన్నదమ్ములతో పాటు వారి స్నేహితుడు మృతిచెందారు..

బంజారాహిల్స్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనస్ (19) తమ ఇంట్లో ఉన్న మోటారు స్విచ్ ఆన్ చేసేందుకు యత్నించగా కరెంట్ షాక్కు గురయ్యాడు. వెంటనే సమీపంలో ఉన్న రిజ్వాన్ (18) తన అన్నను కాపాడేందుకు యత్నించగా అతడికి కూడా షాక్ తగిలింది. అన్నదమ్ములను రక్షించేందుకు పక్కనే ఉన్న స్నేహితుడు రజాక్ (16) ప్రయత్నించగా ప్రమాదవశాత్తు అతడు కూడా షాక్కి గురయ్యాడు. ముగ్గురూ ఘటనాస్థలంలోనే చనిపోయారు. ఈ ఘటన స్థానికులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. ఆయా కుటుంబాలలో తీరని విషాదాన్ని నింపింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు..

## 14 నుంచి వామపక్షాల ప్రచార భేరి

**గూడూరు**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ ఈనెల 14వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం మరియు సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో ప్రచార బేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూలం రమేష్ వెల్లడించారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

## ఏరులై పారుతున్న మద్యం

**కాకినాడ**

ఎన్నికల ముందు మద్యపాన నిషేధం అన్న జగన్ రెడ్డి.. నేడు ప్రతి గ్రామంలో నాసిరకం మద్యం ఏరులై పారిస్తూ మహిళల మాంగల్యాలు మంట గలుపుతున్నారని మాజీ మేయర్, కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని విమర్శించారు. కాకినాడలో ప్రభుత్వ మద్యం షాపు వద్ద మద్యపాన నిషేధంపై మాట తప్పిన ప్రభుత్వ వైఖరి పై నిరసిస్తూ మాజీ మేయర్ సుంకర పావని ఆధ్వర్యంలో మహిళలు ఆందోళనకు దిగారు.కాకినాడ సాలిపేట గర్ల్స్ హై స్కూల్ దగ్గర, పెట్రోల్ బంకు ఎదురుగా గల ప్రభుత్వ మద్యం షాపు వద్ద కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. మద్యపాన నిషేదం ఎక్కదంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ కల్తీ బ్రాండ్లు విక్రయించి వేల కోట్లు జగన్ సర్కార్ దండుకుంటుందని విమర్శించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం విక్రయించే కల్తీ మద్యం త్రాగి మూడున్నరేళ్లలో వందలాది మంది చనిపోయారని మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్స్కి అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన ఆదాయాన్ని కూడా తాడేపల్లి ప్యాలెస్ కి మళ్లిస్తున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లీలా ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి. డ్రగ్ మాఫియా చెలరేగిపోతోందని దేశంలో ఎక్కడా గంజాయి, డ్రగ్స్ పట్టుబడ్డా.. అందులో ఏపీ మూలాలు ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు గుత్తుల సూర్యావతి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఏపీ మంత్రులు నోటిని అదుపులో పెట్టుకోవాలి

**సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని చివ్వెంల పరిధిలో బి.ఆర్.ఎస్ ఆత్మీయ సమ్మేళనం లో మంత్రి జగదీష్ రెడ్డి పాల్గోన్నారు. మంత్రి మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై కేంద్రం వెనక్కి దగ్గడం బీఆర్ఎస్ విజయం. తాత్కాలికంగా ఎన్నికలు దృష్టిలోనిపెట్టుకుని బీజేపీ తప్పించుకునే ప్రయత్నం చేసింది. ఏపీ మంత్రులు మాటలు జాగ్రత్తగా వాడకపోతే.. అందరి చిట్టాలు విప్పుతాం. కేంద్ర పూర్తిస్థాయి నిర్ణయంగా భావించడంలేదు. బీఆర్ఎస్ బి డ్డింగ్ లో పాల్గొంటుందనే కేంద్రం వెనుకడుగు వేసింది. ఏపీ ప్రజల నుండి స్థానిక పార్టీలకు వ్యతిరేకత వస్తుందనందునే ప్రకటన వచ్చింది. బీజేపీ స్థానిక ప్రజలను మోసం చేసేందుకే తత్కాలీక ప్రకటన. క ప్రజలు న్యాయమైన కోరికను బీఆర్ఎస్ బలపరుస్తుందనే ఏపీ భయం. ఏపీ ప్రజల వైపు బీఆర్ఎస్ నిలబడితే ఎందుకు ఆంధ్ర మంత్రులకు భయం. ఏపీ మంత్రుల వి అజ్ఞానం అపరిపక్వత మాటలని విమర్శించారు. వలసలు ఎక్కడ బ్రతకడానికి బాగుంటే అక్కడికి తిరిగి వస్తారు అదే హరిష్ చెప్పాడు. జగన్ ఏపీ మంత్రులపై చర్యలు తీసుకోవాలి. బీజేపీ నాటకం సుకేశ్ అంశం. బీజేపీ ఎంపీ చేసిన మాటలు బేస్ చేసుకుని సీబీఐ ,ఈ డీతో బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు.

## మండల పరిషత్ కార్యాలయానికి తాళం

**యాదగిరిగుట్ట**

యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కింద ముంపునకు గురవుతున్న లప్పనాయక్ తండా గ్రామస్తులకు పరిహారం, పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా అమలు చేయడం లేదంటూ యాదగిరిగుట్టలో మండల పరిషత్ కార్యాలయానికి నిర్వాసితులు తాళం వేసారుర. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగానే బయటి నుండి తాళం వేసి నిరసన తెలిపి లప్పనాయక్ తండా గ్రామస్తులు...ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసారు.

అంతకు ముందు యాదగిరిగుట్టలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో నిరసన తెలిపిన లప్పనాయక్ తండా సర్పంచ్ ధనావత్ బుజ్జి శంకర్ నాయక్...గత 28 రోజులుగా రిజర్వాయర్ కట్టపై దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు .బస్వాపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న లప్పనాయక్ తండా గ్రామస్తులకు నష్ట పరిహారం, పునరావాసానికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి ఏడాదిన్నర గడుస్తున్నా అమలు చెయ్యడం లేదని పునరావాసానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగాల పేరిట మోసం

**అన్నమయ్య**

అన్నమయ్య జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయక నిరుద్యోగులకు టోకరా వేసిన ఘరానా మోసగాళ్లను పోలీసులు అరెస్టు చేసారు.

ప్రభుత్వం జాబ్ క్యాలెండరు విడుదల చేసిందని, కలెక్టర్ పి ఎ మరియు ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తా అంటూ ఒక్కొక్కరి దగ్గర నుండి 1,15,000 చొప్పున ఆరుగురినుంచి నిందితులు వసూలు చేసారు. ప్రభుత్వ ముద్రతో కూడిన నకిలీ నియామాకా పత్రాలు అందచేసారు. నకిలీ నియామాక పత్రాలతో ఉద్యోగంలో చేరడానికి బాధితులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అవి ఉత్తిత్తి నియామకాలని తేలింది. మోసపోయామని తెలుసుకొని రాయచోటి పట్టణ పోలీస్ స్టేటస్ లో ఫిర్యాదు చేసారు. రంగం లోకి దిగిన పోలీసులు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ప్రభుత్వ ఆఫీసులకు సంబంధించిన ముద్రణ అచ్చులు (సీళ్ళు )-13, మొబైల్ ఫోన్లు -2, ఒక లాప్టాప్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గతంలో రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విజయవాడలో కొందరినీ మోసం చేసి 55 లక్షలు వసూలు చేశారని పోలీసులు వెల్లడించారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

**హైదరాబాద్:**



ఈ నెల 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ రోజు బి.ఆర్.కె.ఆర్ భవన్ లో జరిగిన సమావేశంలో, ప్రముఖుల వాహనాల రాకపోకల కోసం నిర్దేశించిన అలైటింగ్ పాయింట్ల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు , వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, మున్సిపల్ మేయర్లు, జెడ్పీ చైర్మన్ లు, మున్సిపల్ చైర్ పర్సన్ లు, ప్రజాప్రతినిధులు, ఐఎఎస్, ఐపిఎస్, నేషనల్ మీడియా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు సమావేశానికి హాజరవుతున్నందున వారికి అసౌకర్యం కలగకుండా వేరు వేరుగా అలైటింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని సి.ఎస్ అధికారులకు సూచించారు.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో అతిథులు హాజరవుతున్నందున, వాహనాల హోల్టింగ్ పాయింట్లు కూడా సమీపంలో ఏర్పాటు చేసుకోవాలని సి.ఎస్ సూచించారు. సమావేశానికి వస్తున్న అతిథులు, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా త్రాగు నీరు, మజ్జిగ, స్నాక్స్, పానీయాలు పంపిణీ చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జి.హెచ్.యం.సి అధికారులను ఆదేశించారు. ప్రజలు విక్షించాడానికి ఒఇఆ తెరలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో పాటు జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు సరైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను సి.ఎస్ ఆదేశించారు.ఈ సమావేశంలో డిజిపి అంజనీ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జీఏడీ కార్యదర్శి శేషాద్రి , ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ యోగితా రాణా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అనంతరం జిల్లాల నుండి ప్రజలను తరలించడానికి చేసిన ఏర్పాట్లును కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ లో సి.ఎస్ సమీక్షించారు. మండల కేంద్రాలలో బస్సులు ముందు రోజే సిద్దంగా ఉంచాలని, బస్సులో ప్రయాణించే వారికి అల్పాహారంతో పాటు మధ్యాన్నం , రాత్రి భోజన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి బస్సులో పోలీస్ సిబ్బంది తో పాటు ఒక ఎస్కార్ట్ ఆఫీసర్ ఉండాలని అన్నారు. ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పత్రికలు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు అందరు కృషి చేయాలని సి.ఎస్ కోరారు.

# ఆలయాల భద్రత కోసమే సిసి కెమెరాల ఏర్పాటు

**జగిత్యాల**



ఆలయాల భద్రతకోసమే సిసి కెమెరాలు ఎంతగానో తొడ్పడుతాయని జగిత్యాల రూరల్ ఎంపిపి పాలేపు రాజేంద్రప్రసాద్, పొలాస ఆలయ చైర్మన్ మ్రరిపెల్లి కొండాల్ రావులు అన్నారు.జగిత్యాల రూరల్ మండలం పొలాస పౌలాస్తేశ్వర స్వామి ఆలయంలో గురువారం సిసి కెమెరాలను ఆలయ చైర్మన్ మ్రరిపెల్లి కొండాల్ రావుతో కలిసి ఎంపిపి పాలేపు రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపిపి రాజేంధ్రప్రసాద్, ఆలయ చైర్మన్ కొండాల్ రావులు మాట్లాడుతూ పొలాసలోని పౌలాస్తేశ్వర స్వామి ఆలయానికి ఎంతో ప్రాశాస్త్యం ఉందని, భక్తులకు కొంగు బంగారంగా విలాసిళ్ళుతుంద న్నారు.ఆలయాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సహకారంతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.ఆలయాలే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతు న్నాయని, దొంగల బారినుండి ఆలయాన్ని రక్షించుకునేందుకే సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని అందుబాటులోకి తీసుకువ చ్చామని తెలిపారు.అదునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కోతుల బెడద లేకుండా, అలారం సిస్టమ్ తో సుమారు లక్షా 30 వెలతో సి సి కెమెరాలు ఏర్పాటు చేశామని, రాత్రి వేళల్లో ఎవరూ సంచరించిన ఫోన్ లింకప్ ఉన్నవారికి అలారం మెస్సెజ్ వస్తుందని దాంతో అలర్ట్ అయ్యే అవకాశలున్నాయని రాజేంద్ర ప్రసాద్, కొండాల్ రావులు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ వేణుగోపాల్, వైస్ చైర్మన్ రంగు రాజయ్య, ధర్మకర్తలు గుండేటి బేబీ రాణిరాజు, పుట్ట నాగరాజు, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, భారతపు భూమయ్య, షేర్ల మహేష్, గంగరాజం, గడ్డి చిన మల్లయ్య, తార నాగరాజు, ఆలయ సిబ్బంది కోంద్ర రవి, పూజారులు గోవర్ధన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీదిరి అప్పలరాజుపై ఏపీ సీఎంఓ ఫైర్

**అమరావతి**

మంత్రి సీదిరి అప్పల రాజు చేసిన కామెంట్స్పై ఏపీ ముఖ్యమంత్రి కార్యాలయం సీరియస్ అయ్యింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించింది. ఎవరిపై అయినా కామెంట్స్ చేసేముందు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించింది. నేతల స్థాయి ఏంటి, ఏం మాట్లాడుతున్నాం అనే దానిని దృష్టిలో ఉంచుకుని మాట్లాడా లంటూ సీరియస్ అయ్యింది సీఎంఓ. ఇదే విషయాన్ని సీఎంవో వర్గాలు అనాధికారికంగా పేర్కొన్నాయి. కాగా, బుధవారం నాడు శ్రీకాకుళం జిల్లాలో మీడియాతో మాట్లాడిన ఏపీ మంత్రి సీదిరి అప్పలరాజు.. తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చేస్తే జాతీయ పార్టీ అయిపోతుందా? అని ప్రశ్నించారు. ఓ కోశానైనా జాతీయ వాదం ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ రావు అంతా ప్రాంతీయ వాదులు అని సీరియస్ కామెంట్స్ చేశారు. ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టి తెలంగాణకు నాయకులు అయ్యారని ఫైర్ అయ్యారు. ఏపీలో ప్రజాశాంతి పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి పెద్ద తేడా ఏమీ లేదని వ్యాఖ్యానించారు సీదిరి అప్పలరాజు. అంతేకాదు.. ఆంధ్రా ప్రజలు తెలంగాణకు రావడం మానేస్తే అడుక్కు తినడం తప్ప.. అక్కడ ఏమీ ఉండదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు అప్పలరాజు. తెలంగాణ రాజకీయాలు ఏపీలో ఏమాత్రం పని చేయవని అన్నారు మంత్రి.

ఇవే కాకుండా రాయకూడని భాషలో చాలా కామెంట్స్ చేశారు మంత్రి అప్పలరాజు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో రాజకీయంగా సంచలనం సృష్టించింది. దాంతో ఏపీ సీఎంవో స్పందించింది. మంత్రి చేసిన కామెంట్స్పై సీరియస్ అయ్యింది.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలే జగనన్నను ఆశీర్వదిస్థాయి

**కౌతాళం**

వలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ప్రతి ఇంటికి వెళ్లే సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు జగనన్న సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతిఒక్కరికివివరించాలని బాపూరం వైసిపి యువ నాయకులు గురునాథ్ రెడ్డి తెలియజేశారు. వలంటీర్లు, గృహసారథులు ప్రజల అవసరాలు తీర్చే బాధ్యత మన అందరిపై ఉందని పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలో వీర్ల దీన్నే, బపురం గ్రామల్లో నిర్వహిస్తున్న జగనన్నే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమలు ఇంటింటి ప్రచారంలో గ్రామ వైకాపా నాయకులు కలిసి ఇంటింటికి తిరుగుతూ వైకాపా ప్రభుత్వంలో అందుతున్న పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా లబ్దిపొందిన వారితో గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న సారథ్యంలో మీకు ఏలాంటి ఆంక్షలు లేకుండా సంక్షేమపథకాలు అందుతున్నాయా అని అడుగగా మాకు జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి పథకం నేరుగా అందుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గ మనమంతా ఎమ్మెల్యే నాగిరెడ్డి ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. జగనన్నే మా భవిష్యత్తు సిక్కర్లను లబ్దిదారులు అనుమతితో వారి ఇళ్లకు, సెల్ఫోన్లకు ఆయన అతికించారు. ఈ కార్యక్రమంలో , రాఘవ రెడ్డి, శ్రీనివాస రెడీ, వాలంటీర్లు మాధవి, సచివాలయం సిబ్బంది, వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి కేసు

**గూడూరు**

గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డులో తిరుపతికి చెందిన శోభ అనే మహిళపై గూడూరు రెండో పట్టణానికి చెందిన సాయి దుర్గ అలియాస్ దీపు మత్తులో శోభకు చెందిన కారు అద్దాలు పగలగొట్టింది. అడ్డువచ్చిన శోభ పై బ్లేడుతో దాడి చేయడంతో శోభ తీవ్రంగా గాయపడి గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి చికిత్స పొందింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దీపును అరెస్ట్ చేశారు ఈ సందర్భంగా గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ శోభపై దాడి చేసిన దీపుపై పలు సెక్షన్లతో క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ హాజరత్ బాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వరి కోత మిషన్ లో పడిన తాచుపాము

**కోనసీమ**



మాగాణిలో ఉన్న ఓ భారి తాచుపాము వరి కోత మిషన్లో పడి తీవ్రంగా గాయపడింది. అది అక్కడ్నుంచి కదల్లోక బాధతో విలవిల్లాడుతుంది. ఈ ఘటన కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సింగరాయపాలెం గ్రామం లో చోటు చేసుకుంది. వరి కోత కోసి దాదాపు 5 రోజులు అవుతుంది. అది అప్పటి నుంచి ప్రాణాల కోసం పోరాడుతుంది. గాయంతో విలవిల్లాడుతున్న పామును చూసిన స్థానికులు స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ, వైద్యుడు రమేష్కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దానికి ఆపరేషన్ చేశారు. అది కాస్త కోలుకున్న అనంతరం.. సురక్షత ప్రాంతంలో విడిచిపెట్టారు.

## గంజాయి పై ఉక్కుపాదం

**గూడూరు**

గంజాయి అక్రమ రవాణా జరగకుండా గట్టినగా చర్యలు తీసుకున్నామని ఎక్కడైనా గంజాయి నిల్వచేసిన రవాణా చేస్తున్న ప్రజలకు తెలిసిన సమాచారాన్ని14500 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియజేయాలని తిరుపతి జిల్లా సేబ్ అడిషనల్ ఎస్పీ రాజేందర్ వెల్లడించారు

గూడూరు పట్టణంలోని ధూర్జటి నగర్ లో అక్రమంగా గంజాయి అమ్ముతున్న ముఠాను పోలీసులు మరియు సెబ్ అధికారులు దాడి చేసి అరెస్టు చేశారు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించి అరెస్ట్ అయిన ముద్దాయిలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. తిరుపతి జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ రాజేందర్ మాట్లాడుతూ గంజాయి రవాణా జరగకుండా నిరంతరం గట్టినగా ఏర్పాటు చేసి ఉన్నామని రాబడిన సమాచారం మేరకు సెబ్ మరియు పోలీస్ అధికారులు గూడూరు పట్టణంలోని ధూర్జటి నగర్ లో గంజాయి అమ్ముతున్న 12 మంది ముద్దాయిలను అరెస్టు చేశామని తెలిపారు వారి వద్ద 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వీరికి సరఫరా చేస్తున్న ప్రధాన ముఠా సభ్యులకొరకు విచారణ చేస్తున్నామని ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా జరుగుతూ ఉంటే ప్రజలు తెలిసిన సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయాలని కోరారు ఈ సమావేశంలో సెబ్ డీఎస్పీ జానకిరామ్ ,డి.ఎస్.పి సూర్యనారాయణ రెడ్డి ,సీఐ హాజరత్ బాబు ,సిబ్బంది పాల్గొన్నారు .

## గూడూరులో ఉచిత వైద్య శిబిరాలు

**గూడూరు**

మాజీ మంత్రి నారాయణ సహకారంతో గూడూరు నియోజకవర్గంలో పలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేద ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని గూడూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు.గూడూరు పట్టణ సమీపంలోని గాంధీ నగర్ లో నెల్లూరు నారాయణ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు డాక్టర్లు రోగులను పరీక్షించి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద ప్రజలు అనేక జబ్బులతో బాధపడుతున్నారు అని వారి కొరకు మాజీ మంత్రి నారాయణ సహకారంతో నారాయణ హాస్పిటల్ వైద్య బృందంతో నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు డాక్టర్లు వైద్య పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి నెల్లూరుకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తారని రాబోయే రోజుల్లో ఇంకా పలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి ,వెంకటేశ్వరరాజు ,బిల్లు చెంచురామయ్య,శివకుమార్, సురేంద్ర,తదితరులు పాల్గొన్నారు .

## దాడికి పాల్పడిన నిందితులు అరెస్టు

**పత్తికొండ**

ఈనెల 12 తారీఖున బుధవారం తెల్లవారుజామున పత్తికొండ మండల పరిధిలోని బుగ్గ తాండ గ్రామంలో సబ్ ఎస్ఐ ఓబులేసు, సిబ్బంది పైన దాడి చేసినటువంటి బుగ్గ తాండ గ్రామస్తులు అయినటువంటి రంగా నాయక్, కృష్ణా నాయక్, జాప్లా నాయక్, రవి నాయక్, రంగా నాయక, నెట్టకంటయ్య నాయక్, శ్రీరామ నాయక్ వీరు ఏడు మందిని ఈరోజు పత్తికొండ మరియు గుత్తి రోడ్డులో పాల కేంద్రం వద్ద అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం అయినది అని సి ఐ మురళి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎక్కడ ఆ సాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న తమ దృష్టికి తీసుకువస్తే అరికడతామన్నారు.

# 'లవ్ యూ రామ్' నుంచి ' తు మేరా' పాట విడుదల



క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లతో ఆకట్టుకున్న దర్శకుడు కె దశరథ్ అందిస్తున్న కథతో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ యూ రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డివై చౌదరి, కె దశరథ్ కలిసి మన ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ చక్ర ఫిలింస్ బ్యానర్‌లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ జంటగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్ వీడియోతో పాటు ఉండాలని ఉందీ నీతో' పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి ' తు మేరా' పాటని విడుదల చేశారు. కె వేద ఈ పాటని బుట్యీఫుల్ మెలోడీగా కంపోజ్ చేయగా.. లిప్సిక మరింత అందంగా అలపించారు. సరస్వతి కార్తీక అందించన సాహిత్యం హీరోయిన్స్ మనసులోని ఫీలింగ్స్ ని లవ్లీగా ప్రజంట్ చేసింది. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ ల కెమిస్ట్రీ చూడముచ్చటగా వుంది. సుధాకర్ బొర్రా (టేనస్సీ), డి నాగేశ్వర్ రావు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ గోపు, శివ మొక్క స్క్రీన్ ప్లే అందించారు. ప్రవీణ్ వర్మ మాటలు రాశారు. సాయి సంతోష్ కెమరామెన్ గా, ఎస్.బి ఉద్ధవ్ ఎడిటర్ గా పని చేస్తున్నారు తారాగణం: రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్, బెనర్జీ, ప్రదీప్, కాదంబరి కిరణ్, కార్టూనిస్ట్ మల్లిక్, మీర్, కె దశరథ్, డివై చౌదరి, ప్రభావతి వర్మ, శాంతి దేవగుడి తదితరులు




# ఏజెంట్' థర్డ్ సింగిల్ పాట విడుదల



యంగ్ అండ్ డైనమిక్ హీరో అఖిల్ అక్కినేని మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ఏజెంట్' ఏప్రిల్ 28న బిగ్ స్క్రీన్స్ పైకి రానుంది. స్టైలిష్ మేకర్ సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఏజెంట్ ఇప్పటికే ప్రామెసింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొల్పింది. ఏజెంట్ టీజర్ నేషనల్ వైడ్ ట్రెండ్ అవ్వగా, ఇప్పటికే విడుదలైన పాటలు కూడా మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఏజెంట్ నుంచి బాయ్స్ సెలబ్రేట్ చేసుకునే బ్రేక్-అప్ సాంగ్ 'రామాకృష్ణా' పాటని విడుదల చేశారు. ఇది బ్రేక్-అప్ సాంగ్ అయినప్పటికీ, అఖిల్ ఈ అకేషన్ ని జరుపుకోవడంతో పండుగ వైబ్ తో అలరించింది. హీరో జీవితాన్ని బ్రేకప్ ప్రభావితం చేయలేదని చాలా ఆసక్తికరంగా వినోదాత్మకంగా చెప్పారు. అకాడమీ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఈ పాటకు సాహిత్యం అందించారు. హిప్ హాప్ తమిళ పెప్పీ నంబర్‌ని స్కోర్ చేయగా, రామ్ మిర్యాల ఈ పాటని ఎనర్జిటిక్ గా పాడారు. అఖిల్ ఒక సాధువులా కాషాయ దుస్తులు ధరించి కనిపించడం సర్ ప్రైజింగ్ గా వుంది. ఈ పాటలో అఖిల్ గ్రేస్ ఫుల్ డ్యాన్స్ లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలర్‌ఫుల్ సెట్‌లో చిత్రీకరించిన పాటలో సాక్షి వైద్య కూడా కాషాయం ధరించి కనిపించింది. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. సురేందర్ రెడ్డి మునుపెన్నడూ చూడని అవతార్, క్యారెక్టర్‌లో అఖిల్‌ని ప్రెజెంట్ చేస్తున్నారు. మమ్ముట్టి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కథను వక్కంతం వంశీ అందించారు. రసూల్ ఎల్లోర్ కెమెరా మెన్ గా పని చేస్తున్నారు. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా విడుదల కానున్న ఈ చిత్రానికి అజయ్ సుంకర, దీపా రెడ్డి సహ నిర్మాతలు.



Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950